ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
అన్నమయ్య
జిల్లా వార్తలు
5
సోమవారం 7 జూలై 2025



కూలడానికి సిద్ధంగా ఉన్న పైకప్పు, కుప్పలుగా పడిన టేకు వస్తువులు

వట వృక్షమంత నిర్లక్ష్యం..!

- మొక్కలు పెరిగి మాన్లయ్యాయి..!!
- నాటి బ్రిటీష్ కాలం నాటి దర్పం.. నేడు బూత్ బంగ్లాగా...
- గంజాయి బ్యాచ్‌కు అడ్డా...
- దెయ్యాల సినిమా సెట్టింగ్‌ను తలపించేలా...
- దుస్థితిలో ఇరిగేషన్ ఈఈ భవనం

మదనపల్లెలో ప్రధాన బంగ్లా ఇది. బ్రిటీష్ కాలంలో ప్రస్తుత సాగునీటి వనరులైన చెరువులు, కుంటల నిర్మాణంలో ఆంగ్లేయులది కీలకపాత్రగా చెప్పవచ్చు. రాయలసీమలోని నాలుగు జిల్లాలతో పాటు నెల్లూరు జిల్లాలో జరిగే ఇరిగేషన్ ప్రాజెక్టులు, చెరువులు, కుంటలు, కాలువల నిర్మాణ పర్యవేక్షణ ఇక్కడ నుంచే సాగిందంటే అతిశయోక్తి కాదు.



ఇరిగేషన్‌శాఖ ఈఈ నివాసం ఉండిన బంగ్లా



ఈ చిత్రాన్ని పరికిస్తే..బ్రిటీష్ లేదా రాజుల కాలంలో శత్రువుల బారి నుంచి తప్పించుకోవడానికో లేక తల దాచుకోవడానికో కోట నిర్మించడం చూశాం. దానిపై బురుజు నిర్మాణం కూడా ఉంటుంది. దానికి పైన అటు, ఇటుగా శత్రువులను కనిపెట్టడానికి కాపలాగా సిపాయిలు నిల్చున్నట్లు రెండువైపులా ఏపుగా పెరిగిన చెట్లను తలదన్నేలా ఉన్నాయి.

బంగ్లా బురుజుపై ఇటు, ఇటు పెరుగుతున్న రావిచెట్లు

మదనపల్లె, జూలై 6 (ఆంధ్రజ్యోతి): పట్టణ నడిబొడ్డున ఇరిగేషన్ శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ (ఈఈ) నివాసం కోసం 1905లో బంగ్లాను నిర్మించారు. ఏడు ఎకరాల విస్తీర్ణం ఉన్న ఈ బంగ్లా సముదాయం ప్రస్తుతం ఒకటిన్నర ఎకరాకు పరిమితం కాగా, అర ఎకరాలో బంగ్లా నిర్మాణం విస్తరించింది. అప్పటి నుంచి 2007 వరకు ఇరిగేషన్ పనులు పర్యవేక్షిస్తూ ఈ బంగ్లాలో 50 మంది ఈఈలు నివాసం ఉన్నట్లు ఆ శాఖాధికారులు చెబుతున్నారు. అప్పట్లో ఈ బంగ్లాలో 20 మందికిపైగా పనులు చేస్తుండగా, బంగ్లా ఆవరణంలోని ప్రస్తుతం శిథిలావస్థలోని నిర్మాణాలన్నీ వారి నివాసాలుగా చెబుతున్నారు. ఇంతటి ప్రాధాన్యం, ప్రాచుర్యం ఉన్న బ్రిటీష్ దర్పం ప్రదర్శించిన ఈ బంగ్లా ప్రస్తుతం శిథిలావస్థకు చేరుకుంది. చివరగా 2007లో నివాసం ఉన్న ఈఈ ఉద్యోగ విరమణతో ఖాళీ కాగా, అప్పటి నుంచి భవనం ఆలనా, పాలనా చూసే వారు కరువయ్యారు. దీంతో ఆ బంగ్లా అంచెలంచెలుగా దుస్థితికి చేరుకుంది.

పటిష్టమైన నిర్మాణం..!

అర ఎకరాలో ఉన్న ఈ బంగ్లా నిర్మాణంలో పటిష్టమైన చర్యలు తీసుకున్నట్లు స్పష్టమవుతోంది. 13 ఇంచీల గోడలు, పైకప్పు పెద్ద పెద్ద ఇనుప గరండాలు, టేకు మోదులపై సున్నం,(సుద్ద)తో నిర్మించారు. తీర్లు, ద్వారాలు, ద్వారబంధాలు, కిటికీలు, నిర్మాణంలో వాడిన ప్రతి వస్తువు సొంతం టేకు కొయ్యలే వాడారు.



కప్పులో తీర్లను తప్పించుకుని, గరండాలను దాటుకుని..

మొక్కల ప్రవేశం..

ఇలాంటి పురాతన కట్టడాలైన దేవాలయాలు, బంగ్లాలపై పక్షులు వాలినప్పుడు..అవి తిన్న రావి, మర్రి కాయల నుంచి విత్తనాలు రెట్ట రూపంలో విసర్జిస్తాయి. ఆ విత్తనం మొలచి మొక్కై, మానై, చివరకు వృక్షంగా, ఆపై వట వృక్షమవుతుంది. ఇందులోనూ అదే అయింది. ఈ బంగ్లాపై ఆరు రావి చెట్లు, ఒక మర్రి చెట్టు పెరుగుతున్నాయి. అయితే ఎప్పటికప్పుడు బంగ్లా నిర్వహణ లేకపోవడంతో మొక్కలు మాన్లయ్యాయి.

గోడలను చీల్చుకుంటూ..

నిర్మాణ పటిష్టతతో పనిలేకుండా మొక్కల వేర్లు గోడలను చీల్చుకుంటూ..భూమిని వెతుక్కుంటూ పైనుంచి కిందకు విస్తరించాయి. ఇందులో వేర్ల అన్వేషణలో పెద్ద పెద్ద గరండాలను దాటుకుంటూ, తీర్లను చీల్చుకుంటూ ద్వారబంధాలను బయటకు నెట్టేస్తూ అనుకున్న లక్ష్యం భూమిలోకి వెళ్లిపోయాయి. గ్రౌండ్‌ఫ్లోర్‌తో పాటు మొదటి అంతస్తులదీ ఇదే దారి. ఇలా మొక్కలు పెరిగి మాన్లుగా మారిపోవడంతో బంగ్లా పైకప్పు అంతా నెర్రెలు బారి తీర్లు, టేకు దిమ్మెలు కింద పడిపోయాయి. మరికొన్ని అదే దారిలో పయనిస్తూ, భవనం కూలడానికి సిద్ధంగా ఉంది. దెయ్యాల సినిమా చిత్రీకరణ చేయడానికి కావాల్సిన అన్ని హంగులు, ఏర్పాట్లు ఇక్కడే ఉండటం ఆసక్తిగా మారింది.

ఆకతాయిలకు అడ్డాగా..

బంగ్లా శిథిలావస్థకు చేరుకోవడంతో ఇక్కడున్న విలువైన టేకు కలప, ద్వారబంధాలు, తలుపులు, కిటికీలు చోరీ అయ్యాయి. లోపల కింద ఊడిపడిన పెద్దపెద్ద టేకు దిమ్మెలు, ఇనుప గరండాలు ఎత్తకెళ్లడానికి వీలులేకపోవడంతో అలాగే ఉండిపోయాయి. ప్రస్తుతం ఈ శిథిల బంగ్లా ఆకతాయిలు, గంజాయి, మందుబాబులకు అడ్డాగా మారింది. ఉదయం నుంచి రాత్రి వరకూ యథేచ్ఛగా అసాంఘిక కార్యకలాపాలు సాగుతున్నాయి. ఇదే కాంపౌండ్ ఆవరణంలో కొత్తగా నిర్మించిన భవనంలో నీటి పారుదల శాఖ తంబళ్లపల్లె సబ్‌డివిజన్ కార్యాలయం నడుస్తోంది. అయితే వారి విధుల నిర్వహణ గండంగా మారింది.

ఈ చిత్రాన్ని చూస్తే..ఎక్కడో ఇంట్లోకి ప్రవేశించే మార్గంలోనో లేక బంగ్లాలోని హాలులో గోడకు అటు, ఇటు ఆర్ట్ వేసినట్లు కనిపిస్తోంది. మరో అడుగు ముందుకేస్తే దెయ్యాల సినిమాలో సెట్టింగ్‌ను తలదన్నే రీతిలోని దృశ్యం ఇది. నిజంగా ఆ బంగ్లాలోకి ప్రవేశించే హాలులోని దృష్టాంతం ఇది.

బంగ్లా హాలులో గోడకు అటు, ఇటు ఆర్ట్ వేసినట్లు దర్శనమిస్తున్న రావి చెట్ల వేర్లు



ఈ చిత్రం రెండులో అటు, ఇటు ఉన్న రావి చెట్లను చూడండి. చూడగానే ఇందులో విశేషమేముంది. అన్ని చెట్లలాగానే ఇవి కూడా భూమిపైన మొక్క నాటగా పెరిగిన మాన్లు అనుకుంటే మీరు పొరపడినట్లే. అది భూమి కాదు.. ఎవరూ నాటిందీ అంతకంటే కాదు. పక్షులు చెట్లలోని కాయలు తిని రెట్టేస్తే.. విత్తనం నుంచి మొలిచిన మొక్కతో మొదలై చెట్టును దాటి మాన్లయ్యాయి. అధికారుల నిర్లక్ష్యమంత వటవృక్షాలయ్యాయి.

బంగ్లాపై పెరుగుతున్న రావిచెట్లు



మృతదేహంతో పోలీసుస్టేషన్ ఎదుట బైఠాయింపు

- న్యాయం చేయాలంటూ బంధువుల ఆందోళన



పోలీసుస్టేషన్ ఎదుట మృతదేహంతో ఆందోళన చేస్తున్న దృశ్యం

ఒంటిమిట్ట, జూలై 6 (ఆంధ్రజ్యోతి) : తాము ఇచ్చిన ఫిర్యాదుకు పోలీసు అధికారులు స్పందించి ఉంటే ఒక నిండు ప్రాణం నిలిచేదని, పోలీసుల నిర్లక్ష్యం కారణంగా ఒక ప్రాణం గాలిలో కలిసిపోయిందని బాధిత కుటుంబ సభ్యులు ఆందోళన వ్యక్తం చేశారు. ఆదివారం మధ్యాహ్నం 2.30 గంటల సమయంలో మృతదేహాన్ని పోలీసుస్టేషన్ ఎదురుగా ఉన్న కడప-చెన్నై ప్రధాన రహదారిపై ఉంచి ఆందోళన చేశారు. మండలంలోని రాచపల్లె గ్రామానికి చెందిన మృతుడి కుమారుడు రఫీ తెలిపిన వివరాల మేరకు... ఈనెల 3న సీతాపురం గ్రామానికి చెందిన ఖాదర్‌బాషా అనే వ్యక్తి తమ ఇంటికి అర్ధరాత్రి సమయంలో వచ్చి మీ అంతు చూస్తామని బెదిరించాడని, తాము తలుపులు వేసి పోలీసు అధికారులకు ఫిర్యాదు చేయగా పోలీసు అధికారులు వచ్చి అతడిపై ఎలాంటి చర్యలు తీసుకోకుండా వదిలేశారన్నారు. 4వ తేదీ ఉదయం తిరిగి తాము పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేసినా పోలీసులు పట్టించుకోలేదన్నారు. 5వ తేదీ ఉదయం మా తండ్రి లాలయ్య రైలుకింద పడి మృతి చెందాడని, పోలీసులు తమ ఫిర్యాదుపై చర్యలు తీసుకుని ఉంటే తన తండ్రి మరణించేవాడు కాదని తెలియజేశారు. ఈ మృతిపై తమకు అనుమానాలు ఉన్నాయని, ఖాదర్‌బాషానే తన తండ్రిని హత్య చేసి రైల్వేట్రాక్‌పై వేశాడని ఆరోపించారు. మృతదేహాన్ని రోడ్డుపై ఉంచడంతో సుమారు అరగంట వరకు వాహన రాకపోకలు నిలిచిపోయాయి. విషయం తెలియడంతో సీఐ బాబు పోలీసుస్టేషన్‌కు వచ్చి బాధిత కుటుంబ సభ్యులతో మాట్లాడారు. తమకు న్యాయం చేస్తామని హామీ ఇవ్వడంతో వారు మృతదేహాన్ని అక్కడి నుంచి తీసుకెళ్లారు.

అదృశ్యమైన విద్యార్థిని తిరుమలలో ప్రత్యక్షం

- లొకేషన్ ఆధారంగా తీసుకొచ్చిన పోలీసులు
- తల్లిదండ్రులకు అప్పగింత

మదనపల్లె, జూలై 6 (ఆంధ్రజ్యోతి): డీఫార్మసీ మూడో ఏడాది చదువుతున్న విద్యార్థి శ్వేతశ్రీ ఆచూకీ లభ్యమైంది. కళాశాలకు వెళుతున్నానని మూడురోజుల క్రితం ఇంటి నుంచి వెళ్లిన విద్యార్థిని శనివారం సాయంత్రం తిరుమలలో ఉన్నట్లు పోలీసులు ఫోన్ లొకేషన్ ఆధారంగా గుర్తించారు. అనంతరం తల్లిదండ్రులు, పోలీసులు తిరుమలకు వెళ్లి ఇంటికి తీసుకొచ్చారు. ఈ క్రమంలో ఆదివారం తాలూకా పోలీసుల ఎదుట హాజరు పరిచారు. దీంతో శ్వేతశ్రీ అదృశ్యం కేసు సుఖాంతం కావడంతో అటు తల్లిదండ్రులు, పోలీసులు ఊపిరి పీల్చుకున్నారు. పీటీఎం మండలం పట్టెంవాండ్లపల్లెకు చెందిన నారాయణ, సుజాత ఏకైక కుమార్తె..స్థానిక సీటీఎం సమీపంలోని ఓ ప్రైవేటు కళాశాలలో డి-ఫార్మసీ మూడో సంవత్సరం చదువుతోంది. ఫీజు బకాయి ఉండటంతో కళాశాల యాజమాన్యం ఒత్తిడి చేస్తోందని, ఫీజు కట్టనందుకు బయట నిలబెట్టి ఫొటోలు తీశారని, దీంతో అవమానం భరించలేక ఇంట్లో నుంచి వెళ్లిపోతున్నట్లు లేఖ రాసి వెళ్లిపోయింది. ఫీజు చెల్లించాలని ఎన్నిసార్లు చెప్పినా ప్రయోజనం లేదని, మీకు అర్థం కాలేదని, అందుకే నేను ఇక ఆ కళాశాలలో చదవలేనని, ఇక చనిపోవాలని నిర్ణయించుకున్నట్లు లేఖలో పేర్కొంది. దీంతో ఆందోళనకు గురైన తల్లిదండ్రులు పోలీసులును ఆశ్రయించారు. ఫిర్యాదుపై తాలూకా పోలీసులు అదృశ్యం కేసు నమోదు చేశారు. అన్వేషణలో భాగంగా శనివారం సాయంత్రం శ్వేతశ్రీ ఫోన్ ఆన్‌చేయడంతో తిరుమలలో ఉన్నట్లు లొకేషన్ ఆధారంగా గుర్తించారు. వెంటనే అక్కడి పోలీసులకు సమాచారం ఇవ్వడంతో ఆచూకీ కనుగొన్నారు. అనంతరం ఆమె తల్లిదండ్రులు, బంధువులు, తాలూకా పోలీసులు తిరుమలకు వెళ్లి మదనపల్లెకు తీసుకొచ్చారు. ఆదివారం స్టేషన్‌కు తీసుకొచ్చిన విద్యార్థినిని తల్లిదండ్రులకు అప్పగించారు. దీంతో శ్వేతశ్రీ తల్లిదండ్రులు సంతోషం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సీఐ కళా వెంకటరమణ మాట్లాడుతూ ఈ కేసుపై మరింత లోతుగా విచారిస్తున్నట్లు తెలిపారు. శ్వేతశ్రీ కళాశాల యాజమాన్యం చేసే ఫీజు ఒత్తిడితో వెళ్లిందా? ఎక్కడెక్కడికి వెళ్లింది..ఎవరెవరిని కలిసిందనే కోణంలో విచారించనున్నట్లు తెలిపారు.



శ్వేతశ్రీని తల్లికి అప్పగిస్తున్న పోలీసులు

భక్తిశ్రద్ధలతో మొహర్రం



ప్రభల్లో పీర్లను ఊరేగిస్తున్న దృశ్యం

రామసముద్రం, జూలై 6 (ఆంధ్రజ్యోతి): హిందూ, ముస్లింలు మత సామరస్యంతో చేసుకునే మొహర్రం పండుగను మండలంలో ఆదివారం భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. దిగువపేట, ఎగువపేట, తిరుమలరెడ్డిపల్లె, ఆర్.నడింపల్లెల్లో ఈ వేడుకలు నిర్వహించారు. ఆయా గ్రామాల చావిడిల్లో పీర్లను ఉంచి ప్రత్యేక ప్రార్థనలు చేసి చక్కెర, శనగ పప్పు చదివింపులు ఇచ్చి భక్తులు మొక్కులు చెల్లించుకున్నారు. తిరుమలరెడ్డిపల్లెలో మహిళలు పానకంతో కూడిన మట్టి కుండలను మేళతాళాలతో ఊరేగింపుగా తీసుకెళ్లి చావిడి ముందున్న అగ్నిగుండం చుట్టూ ప్రదక్షిణలు చేసి పానకం కుండలు పీర్లను ముందు ఉంచి చదివింపులు చేయించారు. ఆదివారం పీర్లను ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన ప్రభల్లో ఉంచి బాజాభజంత్రీలతో ఆయా గ్రామాల వీధుల్లో ఊరేగించారు. అనంతరం మండల కేంద్రంలోని దిగువపేట వద్ద ఉన్న మైదానంలో పీర్లను మిలాఖత్ చేశారు. ఈ వేడుకలు చూడడానికి చుట్టుపక్కల గ్రామాల ప్రజలు అధిక సంఖ్యలో తరలివచ్చారు.

శయనీపతి.. వేంకటపతి

- భక్తులతో కిటకిటలాడిన దేవునికడప

కడప కల్చరల్, జూలై 6 (ఆంధ్రజ్యోతి): తొలి ఏకాదశి పర్వదినం సందర్భాన్ని పురస్కరించుకుని ఆదివారం తెల్లవారుజాము నుంచే తిరుమల తొలిగడప దేవునికడప లక్ష్మీవేంకటేశ్వరస్వామి ఆలయం భక్తులతో కిటకిటలాడింది. ఆషాడ శుద్ధ ఏకాదశిని తొలి ఏకాదశిగా అత్యంత భక్తిశ్రద్ధలతో హిందువులు సంప్రదాయబద్ధంగా జరుపుకుంటారు. తెలుగు సంవత్సరంలో మిగతా అన్ని పండుగలను వెంట పెట్టుకొచ్చే ఏకాదశి పండుగ పర్వదినం కావడం వలన భక్తులు ఆ తిరుమలేశుని దర్శించుకునేందుకు క్యూలైన్లలో బారులు తీరారు. స్వామివారి సేవలో తరించి పరమానంద భరితులయ్యారు. పిల్లలు, పెద్దలు, మహిళలు ఎక్కువగా హాజరై ఆ ఏడుకొండల వెంకన్నను రెండుకన్నులు చాలవన్నట్లుగా తిలకించి భక్తి పారవశ్యం పొందారు.



ఆలయంలో కిక్కిరిసిన భక్తులు

జప్తు చేసినా అమ్మేశారు...

- ఇసుక కేటాయింపుల్లో అధికారుల మాయాజాలం
- పోలీసు నిఘాతో ప్రయోజనం శూన్యం....
- చర్యలకు ప్రజా ప్రతినిధుల డిమాండ్

7

గొర్రెల మందపై దూసుకెళ్లిన ట్రాక్టర్

- 20 గొర్రెలు మృతి...

15 గొర్రెలకు తీవ్ర గాయాలు

వైవిధ్యభరితమైన ఉత్పత్తులతోనే మనుగడ

- రాష్ట్ర ఫుడ్ ప్రాసెసింగ్ కమిషనర్ చిరంజీవి చౌదరి

పీలేరు, జూలై 6 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని రైతు ఉత్పత్తిదారుల సంఘాలు (ఎఫ్‌పీవోలు) వైవిధ్యభరితమైన ఉత్పత్తుల సేకరణ, తయారీపై దృష్టి పెడితేనే నేటి పోటీ ప్రపంచంలో మనుగడ సాగించగలవని రాష్ట్ర ఫుడ్ ప్రాసెసింగ్, పరిశ్రమలు, వాణిజ్య శాఖ కమిషనర్ చిరంజీవి చౌదరి తెలిపారు. పీలేరు మండలం తలపుల గ్రామంలోని అన్నమయ్య రైతు ఉత్పత్తిదారుల సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటవుతున్న మామిడి పండ్ల వేపర్ హీట్ ట్రీట్‌మెంట్ (వీహెచ్‌టీ) ప్లాంటును ఆదివారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన ఎఫ్‌పీవో సభ్యులతో మాట్లాడారు. ఏక పంట మీద ఆధారపడితే రైతులు గానీ, రైతు ఉత్పత్తిదారుల సంఘాలు గానీ మనుగడ సాగించలేవని, వైవిధ్యభరితమైన ఉత్పత్తుల సేకరణ, తయారీపై దృష్టి పెడితేనే నేటి పోటీ ప్రపంచంలో మనుగడ సాగించగలవని సూచించారు. గతంలో కేవలం పొగాకు ఉత్పత్తుల మీద ఆధారపడిన ఐటీసీ సంస్థ మారిన కాలానుకనుగుణంగా అనేక ఉత్పత్తులు తయారు చేస్తూ అగ్రగామి సంస్థగా ఎదిగిందన్నారు. మామిడి మీద దృష్టి పెట్టడం వల్లనే ఈ ఏడాది అనేక రైతు సంఘాలు సంక్షోభంలో కూరుకుపోయాయన్నారు. ఫుడ్ ప్రాసెసింగ్, విలువ ఆధారిత ఉత్పత్తుల తయారీపై పనిచేసే ఎఫ్‌పీవోలను ప్రోత్సహించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. తలపుల వంటి గ్రామీణ ప్రాంతంలోని అన్నమయ్య ఎఫ్‌పీవో ద్వారా రూ.4 కోట్లతో ఏర్పాటవుతున్న వేపర్ హీట్ ట్రీట్‌మెంట్ ప్లాంటును ప్రభుత్వం మంజూరు చేసిందని గుర్తు చేశారు. గతంలో ఎన్నడూ లేని విధంగా ఈ ఏడాది ఏర్పడిన తోతాపురి సంక్షోభం దాని పరిష్కారానికి అవకాశాలు సృష్టించిందని, ఆ సమస్య శాశ్వత పరిష్కారానికి ప్రభుత్వం పరిశ్రమ వర్గాలు, ఉద్యానశాఖాధికారులు, ఉద్యాన ప్రాసెసర్లతో మేధోమథనం చేస్తోందన్నారు. అంతకుముందు ఆయన అన్నమయ్య ఎఫ్‌పీవో ద్వారా నిర్మించిన కోల్డ్ స్టోరేజ్ ప్లాంటును సందర్శించారు. తలపులలో ఏర్పాటవుతున్న వేరుశనగ నూనె మిల్లులోని యంత్రాలను పరిశీలించారు. కార్యక్రమంలో డీహెచ్‌వో సుభాషిణి, పీలేరు హెచ్‌వో సుకుమార్ రెడ్డి, డీవీఎంసీ సభ్యుడు బోడేషావలి, అన్నమయ్య ఉత్పత్తిదారుల సంఘం అధ్యక్షుడు జయబ్బనాయుడు, సభ్యులు రామ్మోహన్ నాయుడు, తిమ్మయ్య పాల్గొన్నారు.



కోల్డ్ స్టోరేజ్‌లోని మామిడి పండ్లను పరిశీలిస్తున్న చిరంజీవి చౌదరి, ఇతర అధికారులు

హంస వాహనంపై సౌమ్యనాథస్వామి

నందలూరు, జూలై 6 (ఆంధ్రజ్యోతి) : సౌమ్యనాథస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా మూడో రోజు ఆదివారం ఉదయం పల్లకీసేవ కార్యక్రమాన్ని ఆలయ అర్చకులు సునీల్‌కుమార్, పాంచరాత్ర ఆగమ పండితులు రఘువందన్, పవన్‌కుమార్, మనోజ్‌కుమార్, సాయిస్వామి ఆధ్వర్యంలో భక్తిశ్రద్ధలతో మాడవీధుల్లో నిర్వహించారు. రాత్రి హంస వాహనంపై సౌమ్యనాథుడు శ్రీదేవి, భూదేవితో కలిసి విశేష అలంకరణలో మాడవీధుల్లో ఊరేగుతూ భక్తులకు దర్శనమిచ్చారు. భక్తులు స్వామి వారికి కాయ కర్పూరం సమర్పించారు. కార్యక్రమంలో సూపరింటెండెంట్ హనుమంతప్ప, ఆలయ ఇన్‌స్పెక్టర్ దిలీప్‌కుమార్, విజిలెన్స్ అధికారి శేషాచలం భక్తులు పాల్గొన్నారు.

కిటకిటలాడిన ఆలయం

ఆదివారం తొలి ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని తెల్లవారుజామునుంచే భక్తులు స్వామిని దర్శించుకున్నారు. భక్తులు పెద్దఎత్తున దర్శనానికి తరలివచ్చారు. క్యూలైన్లు భక్తులతో నిండిపోయి ఆలయం కిటకిటలాడింది. భక్తులు స్వామివారిని దర్శించుకుని తమ మొక్కులను తీర్చుకున్నారు.



స్వామి దర్శనానికి బారులుతీరిన భక్తులు

బ్రహ్మోత్సవాల్లో నేడు

ఉత్సవాల్లో భాగంగా నాలుగో రోజు సోమవారం ఉదయం పల్లకీసేవ గ్రామోత్సవం, తిరుమంజనం, రాత్రికి సింహవాహనంపై సౌమ్యనాథస్వామి గ్రామోత్సవం నిర్వహించనున్నట్లు ఆలయ ఇన్‌స్పెక్టర్ దిలీప్‌కుమార్ తెలిపారు.



హంసవాహనంపై భక్తులకు దర్శనమిస్తున్న సౌమ్యనాథుడు

జప్తు చేసినా.. అమ్మేశారు!

- ఇసుక కేటాయింపుల్లో అధికారుల మాయాజాలం
- పోలీసు నిఘాతో ప్రయోజనం శూన్యం....
- చర్యలకు ప్రజా ప్రతినిధుల డిమాండ్

పెద్దతిప్పసముద్రం, జూలై 6 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం స్వాధీనం చేసుకున్న ఇసుకను ఎలాంటి అనుమతులు లేకుండానే తరలించినా ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంపై స్థానికుల్లో ఆగ్రహం వ్యక్తమవుతోంది. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో తంబళ్లపల్లె నియోజకవర్గంలోని పలు ప్రాంతాల్లోని ఇసుక పెద్ద ఎత్తున అక్రమంగా ఇతర ప్రాంతాలకు తరలిపోయింది. ఈ వ్యవహారంలో పాలకులు ప్రమేయం కూడా ఉండడంతోనే రెవెన్యూ అధికారులు గానీ, పోలీసులుగానీ పట్టించుకున్న పాపాన పోలేదని స్థానికులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. 2022లో మల్లెల గ్రామ సమీపంలోని సంపతికోట ఏటిలో నియోజకవర్గ స్థాయి నేత ప్రోద్బలంతో, స్థానిక నాయకుడు రాత్రికి రాత్రే ఇసుకను భారీగా డంప్ చేశాడు. ఈ విషయంపై పలు పత్రికల్లో కథనాలు ప్రచురితం కావడంతో, అధికారులు ఇసుక డంప్‌ను సీజ్ చేశారు. ఈ మేరకు ప్రభుత్వం తరపున ప్రకటన కూడా విడుదల చేశారు

అక్రమంగా తరలించారు

ఇసుక అక్రమ తవ్వకాలకు అనుకూలంగా ఉంటాడనే ఉద్దేశంతో అప్పటి పాలకుడు డిప్యూటీ తహసీల్దారుగా ఉన్న వ్యక్తిని తహసీల్దారుగా నియమించుకోవడంతో, వైసీపీ నాయకులు అడ్డూ అదుపూ లేకుండా ఇసుకను అక్రమంగా తరలించి సొమ్ము చేసుకున్నట్లు సమాచారం. 2024 ఎన్నికల కోడ్ అమలులోకి రాగానే టి. సదుం పంచాయతీ రామాపురం రీచ్ నుంచి సుమారు 10 వేల టిప్పర్ల ఇసుకను రాత్రికి రాత్రే కర్ణాటక రాష్ట్రానికి తరలించి సొమ్ము చేసుకున్నట్లు సమాచారం. చెన్నరాయునిపల్లె సమీపంలోని పాపాఘ్ని నదిలో ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఇసుక డంప్ నుంచి రెవెన్యూ అధికారుల అండదండలతో రాత్రికి రాత్రే ఇసుకను కర్ణాటక రాష్ట్రానికి తరలించారు. ఈ విషయం గుర్తించిన స్థానికులు అక్రమంగా ఇసుక తరలిస్తున్న లారీలను పట్టించినా అధికారులు చర్యలు తీసుకోకపోగా, లారీలను వదిలేసేవారు. దీంతో ఇసుక అక్రమ రవాణాకు అడ్డు అదుపు లేకుండా పోయింది.



మల్లెల పంచాయతీ అంకిరెడ్డిపల్లె ఏటిలో ఇసుక డంప్‌ను పరిశీలిస్తున్న స్పెషల్ పోలీసులు (ఫైల్)



జెట్టివారిపల్లె సమీపంలో అక్రమంగా డంప్ చేసిన ఇసుక (ఫైల్ ఫొటో)

జప్తు చేసిన ఇసుకనూ అమ్మేశారు.

పెద్దతిప్పసముద్రం మండలం మల్లెల గ్రామానికి సమీపంలోని అంకిరెడ్డిపల్లె, ఆవులరెడ్డిపల్లె సమీపంలో సంపతికోట ఏటి వాగులోని ఇసుక అక్రమ డంప్‌ను టీడీపీ నాయకులు, ప్రభుత్వం, ప్రజల దృష్టికి తీసుకెళ్లడంతో స్థానిక అధికారులు ఆ ఇసుక డంప్‌ను సీజ్ చేసి రెవెన్యూ అధికారుల స్వాధీనం చేశారు. ఈ విషయాన్ని స్థానిక నాయకులు లోకాయుక్త దృష్టికి తీసుకెళ్లడంతో ప్రత్యేక బృందంతో దర్యాప్తు చేయించింది. అయితే, స్థానిక తహసీల్దార్‌గా ఉన్న విద్యాసాగర్ ఓ సర్పంచుతో చేతులు కలిపి జప్తు చేసిన ఇసుకను పూర్తిగా అమ్మేశాడని, వారిపై చర్యలు తీసుకోవాలని కూటమి నేతలు డిమాండ్ చేస్తున్నారు.

> **ప్రభుత్వ ఆదేశం మేరకే అనుమతులు**
>
> అధికారుల ఆదేశాల మేరకు ప్రభుత్వ భవనాల నిర్మాణానికే ఇసుకను కేటాయించాం. అనుమతులు లేకుండా ఎవరికీ ఇసుక ఇవ్వలేదు. అక్రమంగా ఇసుక తరలించే వారిపై చర్యలు తీసుకున్నాం
>
> - విద్యాసాగర్, డిప్యూటీ తహసీల్దార్

ఫిర్యాదు చేసినా ప్రయోజనం లేదు

గతంలో జప్తు చేసిన సుమారు 600 లోడ్ల ఇసుకను అమ్మేశారని రెవెన్యూ అధికారులకు, సబ్ కలెక్టర్‌కు ఫిర్యాదు చేసినా ప్రయోజనం లేదని బూర్లపల్లె గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. ప్రభుత్వ అవసరాలకు ఇసుకను ఇచ్చామంటూ స్థానిక వీఆర్వో, వీఆర్ఏ, రెవెన్యూ అధికారులు పొంతన లేని సమాధానాలు చెబుతున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. కనీసం ఇప్పటికైనా జప్తు చేసిన ఇసుకను ప్రభుత్వ పనులకు వినియోగించారా లేక రెవెన్యూ అధికారుల అండదండలతో అమ్మేశారా అనే కోణంలో విచారణ చేసి, చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

పీలేరుకు చేరుకున్న బాపట్ల ఇసుక

- తీరిన తాగునీటి ఫిల్ట్రేషన్ సమస్య



ఇసుకను తొట్టెల్లో నింపుతున్న కార్మికులు

పీలేరు, జూలై 6(ఆంధ్రజ్యోతి): పట్టణానికి సరఫరా చేసే తాగునీటి శుద్ధికి అవసర మైన ఇసుక కొరత సమస్య ఎట్టకేలకు తీరింది. ప్రకాశం జిల్లా బాపట్ల నుంచి నాణ్యమైన సముద్రపు ఇసుక ఆదివారం ఉదయం పీలేరు చేరుకుంది. ఆ ఇసుకను పీలేరు సింగిల్ విండో మాజీ అధ్యక్షుడు యల్లెల రెడ్డప్ప రెడ్డి, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ ఇరగన్న ఆధ్వర్యంలో ఆదివారం నీటి తొట్టెల్లో నింపారు. సమ్మర్ స్టోరేజ్ ట్యాంకుతోపాటు బాలంవారిపల్లె వద్దనున్న గార్గేయ ప్రాజెక్టు నుంచి పంపింగ్ చేసిన నీటిని సముద్రపు ఇసుక నిండిన తొట్టెల్లో నింపి ఫిల్టర్ చేసిన తరువాత ఓవర్‌హెడ్ ట్యాంకులకు సరఫరా చేయాల్సి ఉంది. ఇసుక కొరత కారణంగా కొంత కాలంగా నీటి పంపింగ్ ఆగిపోయింది. ఈ విషయంపై గత నెల 28న ఆంధ్రజ్యోతిలో 'తీరని దాహం!' శీర్షికతో కథనం ప్రచురితమవడంతో స్పందించిన ఎమ్మెల్యే నల్లారి కిశోర్ కుమార్ రెడ్డి, సింగిల్ విండో మాజీ అధ్యక్షుడు ఇసుకను బాపట్ల నుంచి తెప్పించారు. మరో నాలుగు రోజుల్లో పనులన్నింటినీ పూర్తి చేసి సమ్మర్ స్టోరేజ్ ట్యాంకు ద్వారా నీటిని పట్టణ వాసులకు అందజేస్తామని తెలిపారు.

ఆలయాభివృద్ధికి రూ.50 వేలు విరాళం



ఆలయాభివృద్ధికి విరాళం అందజేస్తున్న దాతలు

గుర్రంకొండ, జూలై 6 (ఆంధ్రజ్యోతి): రెడ్డెమ్మకొండ ఆలయ అభివృద్ధికి ఆదివారం గాలివీడుకు చెందిన టీచర్ వెంకట రమణా రెడ్డి రూ.25 వేలు, బి.కొత్తకోటకు చెందిన ఎర్రంరెడ్డి రూ.25 వేలు విరాళం అందజేశారు. ఈ మొత్తాన్ని ఈవో మంజుల స్వీకరించారు. దాతలకు అమ్మవారి దర్శనం కల్పించి తీర్థప్రసాదాలను అందజేశారు. కార్యక్రమంలో ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

సంతానలక్ష్మికి ప్రత్యేక పూజలు

సంతానలక్ష్మిగా పేరుగాంచిన రెడ్డెమ్మ అమ్మవారికి అర్చకులు ఆదివారం ఉదయం అర్చన, పంచామృతాభిషేకం చేశారు. అనంతరం అమ్మవారిని పరిమళభరిత పుష్పాలతో అలంకరించారు. వివిధ ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో తరలివచ్చిన భక్తులు కొబ్బరి కాయలను సమర్పించి తీర్థప్రసాదాలను స్వీకరించారు.

అక్రమార్కులపై చర్యలు తీసుకోవాలి



అక్రమణకు గురైన స్థలం

రైల్వేకోడూరు రూరల్, జూలై 6(ఆంధ్రజ్యోతి): రెడ్డివారిపల్లి పంచాయతీ పరిధిలోని సర్వే నెంబర్ 557లో ఉన్న 0.30 సెంట్ల భూమి విషయంలో అక్రమాలకు పాల్పడిన వారిపై చర్యలు తీసుకోవాలని బాధితుడు మాధవయ్య డిమాండ్ చేశారు. ఈ భూమిని 2001లో కస్తూరి వెంకటయ్య నుంచి కొనుగోలు చేసి, పుల్లంపేట సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో తన తల్లి నారాయణమ్మ పేరు తో రిజిస్ట్రేషన్ చేయించినట్లు తెలిపారు. అప్పటి నుండి ఈ భూమి తమ స్వాధీనంలోనే ఉందని, అన్ని రకాల పన్నుల చెల్లిస్తూ భూమిని అనుభవిస్తున్నామని వివరించారు. కొంతకాలంగా కొందరు రెవెన్యూ శాఖ అధికారులతో కుమ్మక్కై సదరు సర్వే నెంబర్‌ను 557 నుంచి 557పి గా మార్చి 2025లో అక్రమంగా రిజిస్ట్రేషన్ చేయించుకున్నారని మాధవయ్య ఆరోపించారు. ఈ అక్రమ రిజిస్ట్రేషన్ ద్వారా తమకు తీరని నష్టం జరిగిందన్నారు. ఈ విషయమై సంబంధిత అధికారులకు పలుమార్లు ఫిర్యాదు చేసినా ఎలాంటి చర్యలు తీసుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లా అధికారులు స్పందించి తమకు న్యాయం చేయాలన్నారు.

సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలి

కడప నాగరాజుపేట, జూలై 6(ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వ కార్మిక ప్రజా వ్యతిరేక విధానాలను ఎండగట్టేందుకు ఈనెల 9న తలపెట్టిన సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని రైల్వే గూడ్స్‌షెడ్ హమాలీ యూనియన్ ఏఐటీయూసీ అధ్యక్ష, కార్యదర్శులు కేసీ బాదుల్లా, ఎస్.మహబూబ్ బాష పిలుపు నిచ్చారు. ఆదివారం స్థానిక యూనియన్ కార్యాలయంలో వారు మాట్లాడుతూ కార్మిక చట్టాల్లో మార్పులను ఉపసంహరించుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు పాల్, శ్రీను, చిన్నఓబులేసు, నాగేంద్ర, సూరి, సుబ్బరామ్, రంగనాయకులు, మల్లి పాల్గొన్నారు.

గొర్రెల మందపై దూసుకెళ్లిన ట్రాక్టర్

- 20 గొర్రెలు మృతి, 15 గొర్రెలకు తీవ్ర గాయాలు



ప్రమాద స్థలంలో మృతిచెందిన గొర్రెలు

వేంపల్లె, జూలై 6 (ఆంధ్రజ్యోతి): ఇసుక ట్రాక్టర్ దూసుకెళ్లడంతో 20 గొర్రెలు మృతిచెందగా మరో 15 గొర్రెలు తీవ్రంగా గాయపడ్డాయి. ఎస్ఐ తిరుపాల్‌నాయక్ కథనం మేరకు .... తాటిమాకులపల్లెకు చెందిన గంగులయ్యకు గొర్రెలు మేపుతుంటాడు. ఆదివారం మధ్యాహ్నం గొర్రెలకు నీరు తాగించేందుకు వెళుతూ నందిపల్లె వద్ద రోడ్డు దాటుతుండగా పులివెందుల వైపు నుంచి వేంపల్లెకు ఇసుక కోసం వెళుతున్న ట్రాక్టర్ మందపైకి దూసుకెళ్లింది. ట్రాక్టర్‌ను ఆపాలని కేకలు వేస్తున్నా దూసుకు రావడంతో గంగులయ్య పక్కకు దూకి ప్రాణాలు దక్కించుకున్నాడు. ఈ ప్రమాదంలో సుమారు రూ.4లక్షలు విలువైన 20 గొర్రెలు మృత్యువాతపడ్డాయని, 15 గొర్రెలు గాయపడ్డాయని బాధితుడు తెలిపాడు. ప్రమాదంపై కేసు నమోదు చేసి విచారిస్తున్నట్లు ఎస్ఐ తిరుపాల్‌నాయక్ తెలిపారు. ప్రమాద స్థలాన్ని కాంగ్రెస్ పార్టీ ముఖ్య అధికార ప్రతినిధి తులసిరెడ్డి, జడ్పీటీసీ సభ్యుడు రవికుమార్‌రెడ్డి, టీడీపీ మండల కన్వీనర్ మునిరెడ్డి తదితరులు పరిశీలించారు. బాధితుడిని పరామర్శించారు.

వ్యక్తి అదృశ్యం



అంజద్‌ఖాన్

కడప క్రైం, జూలై 6 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని జయనగర్ కాలనీకి చెందిన వనిపెంట అంజద్‌ఖాన్ (41) అదృశ్యమైనట్లు చిన్నచౌకు పోలీసులు తెలిపారు. కడప జయనగర్ కాలనీకి చెందిన వనిపెంట అంజద్‌ఖాన్ గతంలో ఇరిగేషన్ డిపార్ట్‌మెంటు కడప కార్యాలయంలో పనిచేసేవాడు. ఈ మధ్య బద్వేలుకు బదిలీపై వెళ్లాడు. కుటుంబ అవసరాలకోసం చేసిన అప్పులు తీర్చలేక బాధ పడుతుండేవాడు. ఈ నేపథ్యంలో జూన్ 28న ఆఫీసుకు వెళుతున్నానని ఇంట్లో చెప్పి వెళ్లి న ఆయన తిరిగి ఇంటికి వెళ్లలేదు. బంధువుల వద్ద విచారించినా ఆచూకీ తెలియకపోవడంతో అతని భార్య సల్మా ఈ నెల 5న చిన్నచౌకు పోలీసుస్టేషనులో ఫిర్యాదు చేశారు. ఎవరికైనా ఆచూకీ తెలిస్తే చిన్నచౌకు సీఐ నెం.9121100520, ఎస్ఐ 9121100521, 91211 00522లకు ఫోను చేసి సమాచారం తెలపాలని పోలీసులు తెలిపారు.

భార్య కాపురానికి రాలేదని భర్త ఆత్మహత్య



ఉరి వేసుకున్న గోపాల్

గాలివీడు, జూలై6(ఆంధ్రజ్యోతి): తన భార్య కాపురానికి రాలేదని ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్ఐ రామకృష్ణ తెలిపారు. అరవీడు పంచాయతీ మల్లసానివాళ్లపల్లెకు చెందిన తుపాకుల గోపాల్ (37)కు పెద్దమండెం మండలానికి చెందిన రమణమ్మతో పదేళ్ల క్రితం వివాహం కాగా, వీరికి నలుగురు పిల్లలున్నారు. గోపాల్ మద్యానికి బానిసై కుటుంబాన్ని పట్టించుకోకపోవడంతో అతని భార్య రమణమ్మ పుట్టింటికి వెళ్లిపోయింది. ఆమె కాపురానికి రాకపోవడంతో గత రాత్రి తాను చనిపోతున్నట్లు తల్లిదండ్రులకు చెప్పి తాను నివాసం ఉన్న ఇంట్లో చీరతో ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు

వివాహిత ఆత్మహత్య

చాపాడు, జూలై 6 (ఆంధ్రజ్యోతి): ఆర్థిక సమస్యలు తాళలేక ఓ మహిళ ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. మండలంలోని పల్లవోలు గ్రామానికి చెందిన గంగయ్య, రామాంజులమ్మ దంపతులకు (47) ఇద్దరు కూతుళ్లు. గంగయ్య కూలి పనులకు వెళ్లకుండా ఇంటివద్దే కాలక్షేపం చేసేవాడు. దీంతో మనస్తాపానికి గురైన రామాంజులమ్మ శనివారం సాయంత్రం ఇంటిలో చీరెతో ఫ్యానుకు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. మృతదేహానికి ప్రొద్దుటూరులోని జిల్లా ఆస్పత్రిలో ఆదివారం పోస్టుమార్టం చేయించి, కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ముగ్గురు జూదరుల అరెస్టు

- రూ.34550 స్వాధీనం

చెన్నూరు, జూలై 6(ఆంధ్రజ్యోతి): మండలంలోని బుడ్డాయపల్లె గ్రామ సమీప పొలాల్లో జూదమాడుతున్న అదే గ్రామానికి చెందిన ముగ్గురిని అరెస్టు చేసి వారి నుంచి రూ.34,550 నగదును స్వాధీనం చేసుకున్నట్లు సీఐ కృష్ణారెడ్డి తెలిపారు. పక్కాగా అందిన సమాచారం మేరకు ఆదివారం సాయంత్రం సిబ్బందితో కలిసి బుడ్డాయపల్లె గ్రామ సమీప పొలాల్లో దాడులు చేసి ముగ్గురిని అరెస్టు చేశామన్నారు.

హోరాహోరీగా అండర్-19 మెన్స్ క్రికెట్ పోటీలు

- ఇన్నింగ్ 59 పరుగుల తేడాతో అనంతపురం గెలుపు
- డ్రాగా ముగిసిన నెల్లూరు- చిత్తూరు మ్యాచ్



వరుణ్‌సాయి (అనంతపురం) · విష్ణువర్ధన్ (కర్నూలు) · మన్విత్‌రెడ్డి (నెల్లూరు) · హమీద్ (నెల్లూరు)

కడప స్పోర్ట్స్, జూలై 6 (ఆంధ్రజ్యోతి): ఏసీఏ అండర్-19 మెన్స్ మల్టీడే (మూడురోజుల) క్రికెట్ పోటీల్లో మూడవ రోజైన ఆదివారం కర్నూలు జట్టుపై అనంతపురం జట్టు ఇన్నింగ్స్ 59 పరుగుల తేడాతో గెలుపు సాధించింది. .

కేఓఆర్ఎం మైదానంలో

నగర శివారులోని కేఓఆర్ఎం క్రికెట్ మైదానంలో కర్నూలు-అనంతపురం జట్ల మధ్య మ్యాచ్‌లో తొలుత బ్యాటింగ్ చేసిన కర్నూలు జట్టు మొదటి ఇన్నింగ్స్‌లో 59.3 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 213 పరుగుల వద్ద డిక్లేర్ చేసిన సంగతి తెలిసిందే. తదుపరి బ్యాటింగ్‌కు దిగిన అనంతపురం జట్టు రెండవ రోజు 82.2 ఓవర్లలో 8 వికెట్లు కోల్పోయి 486 పరుగుల వద్ద డిక్లేర్ చేసింది. ఇందులో వీరారెడ్డి ఏకంగా 251 పరుగులు చేయగా, జయంత్‌కృష్ణ 79 పరుగులు, సందీప్‌రెడ్డి 55 పరుగులు చేసి జట్టు భారీ స్కోర్‌కు బాటలు వేశారు. దీంతో అనంతపురం జట్టుకు 273 పరుగులు ఆధిక్యత లభించింది. రెండవ ఇన్నింగ్స్ ప్రారంభించిన కర్నూలు జట్టు ఆట ముగిసే సమయానికి 26 ఓవర్లలో 3 వికెట్లు కోల్పోయి 115 పరుగులు చేసింది. ఇందులో విష్ణువర్ధన్‌నాయుడు 69 పరుగులు చేశాడు. ఆటకు చివరి రోజైన ఆదివారం ఓవర్‌నైట్ స్కోర్ 115 పరుగుల వద్ద బ్యాటింగ్‌కు దిగిన కర్నూలు జట్టు 51.1 ఓవర్లలో 214 పరుగులకు ఆలౌట్ అయింది. ఇందులో విష్ణువర్ధన్‌నాయుడు 87 పరుగులు చేశారు. అనంతపురం బౌలర్ వరుణ్‌సాయి నాయుడు 5 వికెట్లు పడగొట్టాడు. దీంతో ఇన్నింగ్స్ 59 పరుగుల తేడాతో అనంతపురం జట్టు గెలుపు సాధించింది.

వైఎస్ రాజారెడ్డి స్టేడియంలో..

వైఎస్ రాజారెడ్డి ఏసీఏ క్రికెట్ స్టేడియంలో నెల్లూరు జట్టు తన మొదటి ఇన్నింగ్స్‌లో 77.3 ఓవర్లలో 338 పరుగులకు ఆలౌట్ కాగా, చిత్తూరు జట్టు మొదటి ఇన్నింగ్స్‌లో 20 పరుగుల స్వల్ప తేడాతో వెనుకబడింది. అనంతరం రెండవ ఇన్నింగ్స్ ప్రారంభించిన నెల్లూరు జట్టు ఆదివారం నాటికి 87 ఓవర్లలో 384 పరుగులు చేసి ఆలౌటైంది. మన్విత్‌రెడ్డి 97 పరుగులు, ఎస్ఎస్ హమీద్ 67 పరుగులు, కారుణ్యప్రసాద్ 52 పరుగులు చేశారు. అనంతరం రెండవ ఇన్నింగ్స్ ప్రారంభించిన చిత్తూరు జట్టు ఆట ముగిసే సమయానికి 10 ఓవర్లపాటు బ్యాటింగ్‌చేసి 1 వికెట్ నష్టానికి 48 పరుగుల చేసింది. దీంతో నిర్వాహకులు మ్యాచ్‌ను డ్రాగా ప్రకటించారు.

బెల్టుషాపులపై అగ్రహారంవాసుల ఆగ్రహం





బెల్టుషాపులు ఎత్తివేయాలని కోరుతున్న మహిళలు, గ్రామస్థులు (ఇన్‌సెట్) పట్టుబడిన మద్యం సీసాలు

పోరుమామిళ్ల, జూలై 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అగ్రహారం గ్రామానికి మద్యం సరఫరా చేస్తున్నవారిని ఆదివారం గ్రామస్థులు వాటిని అడుకోవడంతోపాటు పోలీసులకు సమాచారం అందించారు. ఈ సందర్భంగా గ్రామస్థులు, మహిళలు మాట్లాడుతూ అగ్రహారంలో బడి, గుడి వద్ద మరో చోట పోటాపోటీగా బెల్టుషాపులు నిర్వహిస్తున్నారన్నారు. ఈ బెల్టుషాపులు లేనప్పుడు పోరుమామిళ్ల వెళ్లి తాగి వచ్చేవారని, ఇప్పుడు అగ్రహారంలోనే మూడు చోట్ల మద్యం లభిస్తుండడం, డోర్ డెలివరీ కూడా చేస్తుండడంతో మద్యం ప్రియుల ఆగడాలకు అంతు లేకుండా పోయిందన్నారు. పగలు రాత్రి తేడా లేకుండా మద్యంప్రియులు మద్యం తాగి గొడవ పడుతుండడంతో మహిళలకు మనశ్శాంతి లేకుండా పోయిందన్నారు. ఇప్పటికైనా అధికారులు చర్యలు తీసుకుని బెల్టుషాపుల నిర్వాహకులపై చర్యలు తీసుకుకోవాలని కోరుతున్నారు.

30 మద్యం సీసాలు స్వాధీనం

బెల్టుషాపులకు మద్యం తరలిస్తుండగా దాడులు చేసినట్లు ఎస్ఐ కొండారెడ్డి తెలిపారు. ఆదివారం తమకందిన సమాచారం మేరకు మండలంలోని అగ్రహారం ఊరి బయట మద్యం తీసుకెళుతున్న వ్యక్తిని అదుపులోకి తీసుకుని అతని నుంచి 30 సీసాలు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు తెలిపారు. గ్రామాల్లో ఎవరైనా బెల్టుషాపులు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

మహిళ హత్య కేసులో నిందితుడి అరెస్టు



విలేకరులతో మాట్లాడుతున్న డీఎస్పీ మురళినాయక్

పులివెందుల, జూలై 6 (ఆంధ్రజ్యోతి): మహిళను హత్య చేసిన కేసులో నిందితుడిని అరెస్టు చేసినట్లు డీఎస్పీ మురళినాయక్ తెలిపారు. ఆదివారం సాయంత్రం పులివెందుల అర్బన్ స్టేషన్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన వివరాలు వెల్లడించారు. పులివెందుల ని గుంత బజార్‌లో నివాసముంటున్న బోనాల హసీనా సౌదీకి వెళ్లి వచ్చింది. అక్కడ సంపాదించుకున్న డబ్బుతో వడ్డీ వ్యాపారం చేస్తూ జీవిస్తోంది. రెండేళ్ల క్రితం దేవిరెడ్డి కరుణ కుమారి అనే మహిళకు రూ.2 లక్షలను రూపాయి వడ్డీకి అప్పుగా ఇచ్చింది. ఆ మొత్తాన్ని చెల్లించాలంటూ ఈ మధ్యకాలంలో రుణగ్రహీతపై తీవ్రంగా ఒత్తిడి చేసింది. ఈ విషయం గమనించిన కరుణకుమారి కుమారుడు లిఖిత్ కుమార్ రెడ్డి జూన్ 29 మధ్యాహ్నం హసీనాను హత్య చేశాడు. ఆమె ఇంట్లోని ప్రామిసరీ నోట్లను తీసుకు వెళ్లి శిల్పారామం సమీపంలో కాల్చి వేశాడు. ఆదివారం ఉదయం ఉలిమెల్ల రింగ్‌రోడ్డులో పులివెందుల ట్రాఫిక్ సీఐ హాజీవల్లి,అర్బన్ ఎస్ఐ నారాయణ టీం నిందితుడిని అరెస్టు చేసినట్లు తెలిపారు.

12వ పీఆర్సీ కమిషన్‌ను వెంటనే నియమించాలి

కడప ఎడ్యుకేషన్, జూలై 6(ఆంధ్రజ్యోతి): పీఆర్సీని నియమించి కార్యాచరణను ప్రారంభించాలని ఏపీటీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఆదిరెడ్డి శ్యామ్‌సుందరెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం నగరంలోని ఏపీటీఎఫ్ జిల్లా కార్యాలయంలో ముఖ్య కార్యకర్తల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2023 జూలై 1 నుంచే 12వ పీఆర్సీ అమలు కావాల్సి ఉండగా రెండు సంవత్సరాలు గడిచినా కనీసం పీఆర్సీ కమిషన్‌ను కూడా నియమించకపోవడం వల్ల ఆర్థికంగా తీవ్రనష్టం జరుగుతోందన్నారు. పీఆర్సీ కమిషన్ ఛైర్మన్ రాజీనామా చేసి ఏడాదైనా ఇంత వరకు కొత్త కమిషన్‌ను నియమించలేదన్నారు. 12వ పీఆర్సీ అమలులో జాప్యం జరిగే అవకాశం ఉందని, వెంటనే ముఖ్యమంత్రి ఉద్యోగ, ఉపాధ్యాయ, పించనర్లకు 30శాతం మధ్యంతర భృతిని ప్రకటించాలన్నారు. కూటమి ప్రభుత్వం ఎన్నికల సందర్భంగా ఇచ్చిన మధ్యంతర భృతిని, మెరుగైన ఫిట్‌మెంట్‌తో 12వ పీఆర్సీని ప్రకటించాలన్నారు. సమావేశంలో ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఖాదర్‌బాష, శ్రీనివాసరెడ్డి, జిల్లా కార్యదర్శులు రాంభూపాల్‌రెడ్డి, అబ్దుల్ సత్తార్, జిల్లాకౌన్సిలర్లు రామచంద్రారెడ్డి, కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కేసీ కెనాల్ షట్టర్లకు గేర్ బాక్సులు ఏర్పాటు చేయాలి

చెన్నూరు, జూలై 6(ఆంధ్రజ్యోతి): త్వరలో కేసీ కెనాల్‌కు నీరు రానున్న దృష్ట్యా ఉప కాల్వలకు ఉన్న తూములకు గేర్ బాక్సులు ఏర్పాటు చేయాలని మండల కన్వీనరు టీడీపీ కె.విజయ భాస్కర్‌రెడ్డి కోరారు. ఆదినిమ్మాయపల్లె ఆనకట్ట నుంచి కడప పాతకడప చెరువుకు వెళ్లే ప్రధాన కాల్వ, చెన్నూరు తూము ఉప కాల్వ షట్టర్ల గేర్‌బాక్స్‌లు చోరీ అయ్యాయని, తక్షణం వాటిని ఏర్పాటు చేయాలన్నారు. గేర్‌బాక్సులు లేకపోతే నీరు నిరంతరాయంగా ఉపకాల్వకు ప్రవహిస్తుందన్నారు. చెన్నూరు తూముకు ఉన్న మూడు షట్టర్లలో ఒకదానికి మాత్రమే గేర్‌బాక్స్ ఉందని, కేసీ అధికారులు ఆలస్యం చేయకుండా గేర్‌బాక్సులు ఏర్పాటు చేయాలన్నారు.

ఐక్యతకు ప్రతీక పీర్ల పండుగ

రైల్వేకోడూరు రూరల్, జూలై 6 (ఆంధ్రజ్యోతి): ఐక్యతకు ప్రతీక పీర్ల పండుగ అని పలువురు పేర్కొన్నారు. కోడూరు మండలంలోని పలు గ్రామాలలో పీర్ల పండుగను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ప్రధానంగా రెడ్డివారిపల్లి, బుడుగుంటపల్లి, తురకపల్లి, రాఘవరాజుపురం, శెట్టిగుంట గ్రామాలలో ఈ పండుగ వైభవంగా జరిగింది. చుట్టుపక్కల గ్రామస్థులు పీర్లను దర్శించుకున్నారు. నిప్పుల గుండంపై నడిచే కార్యక్రమం అందరినీ ఆకట్టుకుంది. కోర్కెలు నెరవేరాలని ఇష్టదైవం అనుగ్రహం కలగాలని భక్తుల భక్తిశ్రద్ధలతో నిప్పుల గుండంపై నడిచారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా పోలీసులు ప్రతి గ్రామంలో బందోబస్తు ఏర్పాటు చేశారు.

ఓబులవారిపల్లె: మండల పరిధిలోని వై.కోట గ్రామ పంచాయతీలో మొహర్రం వేడుకలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. గ్రామం మొత్తం పీర్లతో తిరుగుతూ కత్తులు, కొడవళ్లతో నృత్యాలను చేస్తూ పులి అడుగులు వేస్తూ సందడి చేశారు.

చిట్వేలి: మూడు పీర్ల చావిడిలలో ఉన్న 15 పీర్లకు శని,ఆది వారాల్లో అగ్ని గుండాలు ఏర్పాటు చేసి అందులో ప్రవేశించారు. భక్తులు చదివింపులు చేసి మొక్కులు తీర్చుకున్నారు. పీర్లను నదికి తరలించి శుభ్రం చేసి మొహర్రం ముగించారు. ఎస్ఐ నవీన్ బాబు బందోబస్తు ఏర్పాటు చేశారు.

లక్కిరెడ్డిపల్లె: ప్రధానంగా సిద్దకవాండ్లపల్లె, రెడ్డివారిపల్లె, కస్తూరిరాజుగారిపల్లె, పందిళ్లపల్లె గ్రామాల్లో మొహర్రం నిర్వహించారు. పీర్లను ఎత్తుకొని అగ్నిగుండంలోకి ప్రవేశించారు. పీర్లను కస్తూరిరాజుగారిపల్లె వంకలో నిజ్జనం చేశారు. సిద్దకవాండ్లపల్లెలో కొండయ్య పీరు కస్తూరిజుగారిపల్లె లోని కొండయ్య సమాధి వద్దకు వచ్చి పూజలు నిర్వహించి అక్కడే జల్ది చేశారు.

పెనగలూరు: పి.కొత్తపల్లె, ఓబిలి, నల్లపురెడ్డిపల్లె, నారాయణనెల్లూరు, నాయుడువారిపల్లె గ్రామాల్లో హిందూ ముస్లిం నూర్‌బాషా, దూదేకుల సంఘం సోదరుల సమైక్యతతో మొహర్రం జరుపుకున్నారు. సాయంత్రం పీర్లచావిడి నుంచి పీర్లను తీసుకుని ఊరేగింపుగా నిమజ్జనానికి వెళ్లారు.

గాలివీడు: బోరెడ్డిగారిపల్లె, గుంటికాడపల్లి, అరవీడుల్లో మొహరం పండుగను నిర్వహించారు. పదవ రోజు సాయంత్రం గుంటికాడపల్లి, బోరెడ్డిగారిపల్లె, పీర్ల కలయికతో జల్ది కార్యక్రమంతో పీర్ల పండుగ ముగిసింది.

వీరబల్లి: త్యాగానికి ప్రతీకగా మొహరం నిర్వహిస్తారని వీఆర్‌డీఎస్ సురేంద్రారెడ్డి తెలిపారు. పుత్తావాడ్లపల్లెకు చెందిన సిరిగిని కుళాయిరెడ్డి, చంద్రమ్మ దంపతులు పెద్ద ఎత్తున అన్నదానం నిర్వహించారు. స్థానిక ఎస్ఐ నరసింహారెడ్డి బందోబస్తు నిర్వహించారు.

చిన్నమండెంలో...

మండల కేంద్రంలోని మఖాన్ వద్ద కొలువుదీరిన గంధపు పీరును ప్రముఖ రాజకీయ నాయకులు దర్శించుకుని ప్రార్థనలు చేశా రు. శనివారం మంత్రి సోదరుడు మండిపల్లి లక్ష్మీప్రసాద్‌రెడ్డి, వైసీపీ నాయకుడు సుగవాసి బాలసుబ్రమణ్యం, మాజీ వైస్ చైర్మన్ దేవనాథ్‌రెడ్డి పూజలు నిర్వహించారు. నాయకులను పెద్ద దర్గా గురువు హారిఫుల్లా హుస్సేనిఖాన్ ఆశీర్వదించారు. ముంబై, బెంగుళూరు, కడప జిల్లా వివిధ సూదూర ప్రాంతాల నుంచి హిందూ, ముస్లిం, మైనార్టీ సోదరులు హాజరయ్యారు.



చిన్నమండెంలో పీర్లను ఊరేగిస్తున్న భక్తులు



రైల్వేకోడూరు: ప్రత్యేక అలంకరణలో పీర్లు



చిట్వేలి: పీర్లను గ్రామోత్సవంగా ఏటికి సాగనంపుతున్న భక్తులు



లక్కిరెడ్డిపల్లె: కస్తూరిరాజుగారిపల్లె వద్ద కలుసుకున్న పీర్లు







పెనగలూరులో పీర్లను ఊరేగిస్తున్న భక్తులు... బోరెడ్డిగారిపల్లె, గుంటికాడపల్లె పీర్లు కలుసుకున్న దృశ్యం.. మొహర్రం సందర్భంగా వీరబల్లిలో అన్నదానం

ఘనంగా తొలి ఏకాదశి పూజలు

రైల్వేకోడూరు రూరల్, జూలై 6(ఆంధ్రజ్యోతి): రాయచోటి, రాజంపేట, రైల్వేకోడూరు నియోజకవర్గాల్లో ఆదివారం తొలి ఏకాదశి పూజలు ఘనంగా నిర్వహించారు. రైల్వేకోడూరు పట్టణంలో వెలసిన ప్రసన్న వేంకటేశ్వర స్వామి ఆలయం భక్తులతో కిటకిటలాడింది. శ్రీవారి దర్శనం కోసం భక్తులు పోటెత్తారు. ఉదయం నుంచి పూ జలు చేశారు. మాజీ ఎమ్మెల్యే కొరముట్ల శ్రీనివాసులు స్వామివారిని దర్శించుకున్నారు. అర్చకుడు మణికంఠ శర్మ తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.



రైల్వేకోడూరులోని ప్రసన్న వేంకటేశ్వర స్వామికి పూజలు చేస్తున్న భక్తులు

సిద్ధవటం : మండలంలో తొలి ఏకాదశి ఘనంగా నిర్వహించారు. ఆలయ పూజారి గోపాలకృష్ణ పూజలు నిర్వహించి భక్తులకు తీర్థప్రసాదాలు అందించారు. ఈ కార్యక్రమంలో గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.



సిద్దవటం : పూజా కార్యక్రమంలో పాల్గొన్న భక్తులు

నందలూరు: తొలి ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని కోడూరు ఎమ్మెల్యే, ప్రభుత్వవిప్ అరవ శ్రీధర్ సౌమ్యనాథస్వామిని దర్శించుకున్నారు. ఆర్టీసీ మాజీ చైర్మన్ ఎద్దుల సుబ్బరాయుడు, ఆలయ ఇన్‌స్పెక్టర్ దిలీప్‌కుమార్, సౌమ్యనాథ అన్నదాన ట్రస్టు సభ్యులు చక్రాల సాయినాథ్, సుబ్బరామయ్య, వంశీకృష్ణ, పెంచలయ్య పాల్గొన్నారు.

ఘనంగా సిద్దేశ్వర, చెన్నకేశవ స్వాముల బ్రహ్మోత్సవాలు

రాజంపేట, జూలై 6 (ఆంధ్రజ్యోతి) : అన్నమయ్య ఆరాధ్య దైవాలైన చెన్నకేశవ, సిద్దేశ్వరస్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు ఆదివారం ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా వేదపండితులు ధ్వజారోహణ కార్యక్రమాన్ని నిర్వహించారు. వేదపండితులు ప్ర త్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. శేషవాహనంపై చెన్నకేశవ స్వామి పురవీధుల్లో విహరించారు. ఈ కార్యక్రమంలో ఆలయ సూపరింటెండెంట్ హనుమంతయ్య, ఇన్‌స్పెక్టర్ బాలాజీ తదితరులు పాల్గొన్నారు.



తాళ్లపాకలో శేషవాహనంపై ఊరేగుతున్న చెన్నకేశవ స్వామి

కట్టపుట్టాలమ్మకు పూజలు

ఓబులవారిపల్లె, జూలై6(ఆంధ్రజ్యోతి) :మండల పరిధిలోని మంగంపేట గ్రామ పంచాయతీ పరిధిలో వెలసిన కట్టపుట్టాలమ్మ జాతర సందర్భంగా ఆదివారం అమ్మవారికి భక్తులు ఘనంగా పూజలు చేశారు. సుదూర ప్రాంతాల నుంచి కూడా భక్తులు చేరుకుని అమ్మవారికి మొక్కుకున్నారు. అదేవిధంగా మొక్కుబడులు ఉన్న వారు అన్నదానం చేశారు.



నల్లగంగమ్మకు బంగారు గొలుసు బహూకరణ

సంబేపల్లె, జూలై6(ఆంధ్రజ్యోతి): సంబేపల్లె గ్రామంలో వెలిసిన దేవరరాయి నల్లగంగమ్మ తల్లికి 8 గ్రాముల బంగారు గొలుసును సంబేపల్లె మండలం శెట్టిపల్లె గ్రామం అడవికమ్మపల్లికు చెందిన గుత్తా సత్యనారాయణనాయుడు, సుశీల దంపతులు బహూకరించారు. ఆదివారం దాతలు అమ్మవారిని సందర్శించి ప్రత్యేక పూజలు చేశారు. కాగా తొలి ఏకాదశి సందర్భంగా ఆలయం భక్తులతో పోటెత్తింది.



బంగారు గొలుసును బహూకరిస్తున్న భక్తులు

'విచారణ జరిపించాలి'

లక్కిరెడ్డిపల్లె, జూలై6(ఆంధ్రజ్యోతి): మండలంలో నాడు-నేడులో జరిగిన పనుల అవినీతి, అక్రమాలపై సమగ్ర విచారణ జరిపించాలని సీపీఐ రాయచోటి నియోజకవర్గ కార్యదర్శి సిద్దిగాళ్ల శ్రీనివాసులు పేర్కొన్నారు. ఆదివారం లక్కిరెడ్డిపల్లెలోని ఆయన విలేకరులతో మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వంలో ఫేస్-1, ఫేస్-2 లలో లక్కిరెడ్డిపల్లె మండల వ్యాప్తంగా జరిగిన నాడు- నేడు పనుల్లో అవినీతి, అక్రమాలు నాటి నాయకుల జోక్యంతో కొన్ని చోట్ల పనులు జరగకుండానే బిల్లులు మార్చుకున్నట్టు ఆరోపణలు వినిపిస్తున్నాయి. పూర్తి స్థాయిలో సగ్ర విచారణ జరిపి, ప్రభుత్వ ధనాన్ని రికవరీ చేసి వారిపై శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ ఏశారు. సీపీఐ నాయకులు ఆంజనేయులు, జగన్‌బాబు, ఓబులేసు, సుదర్శన్, హరి, జగదీశ్‌ను పాల్గొన్నారు.

ఝరికోన మొరవ మడుగులో
యువకుడు గల్లంతు

సంబేపల్లె, జూలై6(ఆంధ్రజ్యోతి): స్నేహితులతో కలిసి ఆదివారం సరదాగా గడపాలనుకున్న యువకుడు ఝరికోన మొరవ మడుగులో గల్లంతయ్యాడు. స్నేహితుడి ఆచూకీ కనపడకపోవడంతో దిక్కుతోచక విషయాన్ని శెట్టిపల్లె గ్రామస్తులకు చెప్పారు. పోలీసులకు సమాచారం అందిస్తే వారు తమ లిమిట్స్ కాదంటూ సంబేపల్లె పోలీసులు, తమ లిమిట్స్ కాదంటూ కలకడ పోలీసులు ఒకరి మీద ఒకరు వేసుకొని సమయానికి రాలేదు. చీకటి పడడంతో ఏమీ చేయలేని నిస్సహాయస్థితిలో వదిలేశారు. వివరాల్లోకి వెళితే...

వారంతా రాయచోటి మదరస్సాలో చదివిన పాత స్నేహితులు.ఒక స్నేహితుడు శెట్టిపల్లె మసీదులో మరో స్నేహితుడు దేవపట్ల అసంజివాండ్లపల్లె మసీదులో పనిచేస్తున్నారు. రాయచోటి పట్టణానికి చెందిన ఉస్మాన్ అనే యువకుడితో పాటు నలుగురు స్నేహితులు శెట్టిపల్లికు చెందిన ఐదుగురు యువకులు కలిసి ఆదివారం ఝరికోన ప్రాజెక్టుకు వెళ్లి ఈత కొడదామని మడుగులో దిగారు. వీరిలో ఉస్మాన్ గల్లంతయ్యాడు. పోలీసులకు సమాచారం అందించారు. వీఆర్‌ఏలు మడుగు వద్ద యత్నించగా ఆచూకీ కనిపించలేదని తెలిపారు.



గల్లంతైన ఉస్మాన్ (ఫైల్)

శ్యామ్‌ప్రసాద్ ముఖర్జీకి నివాళి



నివాళులర్పిస్తున్న బీజేపీ నేతలు

రాజంపేట, జూలై 6 (ఆంధ్రజ్యోతి):రాజంపేట పార్లమెంట్ అధ్యక్షుడు సాయిలోకేష్ కార్యాలయంలో భారతీయ జన సంఘ్ వ్యవస్థాపకుడు డాక్టర్ శ్యామ్‌ప్రసాద్ ముఖర్జీకి ఆదివారం ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో పట్టణ, గ్రామీణ అధ్యక్షులు రమణ, ప్రసాద్‌రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు సురేష్‌రాజు తదితరులు పాల్గొన్నారు.

'పీఆర్‌సీని అమలు చేసి బకాయిలు చెల్లించాలి'

రాయచోటిటౌన్, జూలై6(ఆంధ్రజ్యోతి): పీఆర్‌సీని అమలు చేయడంతో పాటు పెండింగ్‌లో ఉన్న డీఏతో పాటు ఆర్థిక బకాయిలను వెంటనే విడుదల చేయాలని యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు హరిప్రసాద్, జాబీర్ డిమాండ్ చేశారు. ఆదివారం వైవీ నాగిరెడ్డి కళాశాలలో యూటీఎఫ్ జిల్లా కార్యవర్గ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్ర ప్రభు త్వం జారీ చేసిన మెనూ 57 ప్రకారం 2003 డీఎస్సీ వారి ని పాత పెన్షన్ విధానంలోకి తీసుకురావాలని డిమాండ్ చేశారు. యూటీఎఫ్ జిల్లా గౌరవాధ్యక్షుడు సుధాకర్‌నాయుడు, జిల్లా సహాధ్యక్షుడు శివారెడ్డి, హేమలత, జిల్లా కోశాధికారి బీ.చంద్రశేఖర్, జిల్లా కార్యదర్శులు పీ.వెంకటసుబ్బయ్య, వై.శ్రీధర్ రెడ్డి, రమణమూర్తి, పురం వెంక్రమణ పాల్గొన్నారు.

ప్రజా సమస్యలకే తొలి ప్రాధాన్యం : ముక్కా



కేతరాజుపల్లెలో ముక్కాకు హారతులు పడుతున్న మహిళలు

పుల్లంపేట, జూలై 6 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యలకే తొలి ప్రాధాన్యం ఇస్తున్నట్లు తెలుగుదేశం పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి, కుడా చైర్మన్ ముక్కా రూపానందరెడ్డి అన్నారు. ఆదివారం మండల పరిధిలోని కేతరాజుపల్లెలో సుపరిపాలన తొలి అడుగు కార్యక్రమం నిర్వహించారు. గ్రామంలో ఆయన ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ పథకాలను వివరించారు. అలాగే గ్రామంలోని సమస్యలను అడిగి తెలుసుకున్నారు. టీడీపీ పేద ప్రజల పక్షాన ఉంటుందని, పేద ప్రజల కోసం అనేక సంక్షేమ కార్యక్రమాలు చేపడుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో జనసేన మండల ఇన్‌చార్జి వెంకటసుబ్బయ్య, టీడీపీ నాయకులు కాపెర్ల చంద్రశేఖర్‌నాయుడు, ముద్దా సుభాష్‌రెడ్డి, సిద్ద రాజారెడ్డి, సింగం ఆదినారాయణరెడ్డి, కేసినేని నారాయణనాయుడు పాల్గొన్నారు.

'అభివృద్ధి, సంక్షేమం చంద్రబాబుకు రెండు కళ్లు'

రాయచోటిటౌన్, జూలై6(ఆంధ్రజ్యోతి): అభివృద్ధి, సంక్షేమం చంద్రబాబుకు రెండు కళ్లు లాంటివని టీడీపీ నేత గాజుల ఖాదర్‌బాషా పేర్కొన్నారు. ఆదివారం ఆయన పట్టణంలోని కొత్తపేట రామాపురం, కొత్తపేట వార్డుల్లో ఇంటింటికి తెలుగుదేశం కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన కూటమి ప్రభుత్వం అమలు చేసిన పలు సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు ప్రజలకు వివరించారు. కూటమి ప్రభుత్వంలో ప్రజలు సంతోషంగా ఉన్నారని, ముఖ్యమంత్రి చంద్రబాబు నేతృత్వంలో ప్రజలకు స్వేచ్ఛ, ప్రశాంతత కలిగిన మంచి ప్రభుత్వం వచ్చిందని ప్రజలు చర్చించుకుంటున్నారన్నారు.

నాగారపమ్మకు పూజలు

సుండుపల్లె, జూలై6(ఆంధ్రజ్యోతి): సుండుపల్లె మండలంలోని పెద్దినేనికాలువ గ్రామ పంచాయతీ ఈడిగపల్లె సమీపంలో వెలిసిన నాగారపమ్మ తల్లి ఆలయంలో ఆదివారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. మండలంతో పాటు రాయచోటి, పీలేరు, రాజంపేట వంటి ప్రాంతాల భక్తులు అమ్మవారికి బోనాలను సమర్పించారు. అమ్మవారికి బోనాలు సమర్పించి ఆలయ సమీపంలోని మామిడి తోటల్లో అన్నదాన కార్యక్రమాల్లో ఏర్పాటు చేశారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి

చిన్నమండెం,జూలై6(ఆంధ్రజ్యోతి): కడప-బెంగుళూరు జాతీయ రహదారిపై తూర్పుల్లె క్రాస్ వద్ద ఇన్నో వాహనం, లారీ ఢీకొని అబ్బవరం రెడ్డిశేఖర్‌రెడ్డి(45) అనే వ్యక్తి అక్కడికక్కడే మృతి చెం దారు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం... కలకడ మండలానికి చెందిన రెడ్డిశేఖర్‌రెడ్డి రాయచోటి చెక్‌పోస్టు వద్ద నివాసం ఉంటున్నాడు. ఇతను వండాడిలో తన స్నేహితుడి ఇంటికి వెళ్లి తిరిగి రాయచోటికి తన ఇన్నోవా వాహనంలో చిన్నమండెం మండలం తూర్పుపల్లి క్రాస్ రోడ్డు వద్దకు వచ్చేసరికి ఎదురుగా వస్తున్న లారీ ఢీకొంది. దీంతో రెడ్డిశేఖర్‌రెడ్డి అక్కడే మృతి చెందారు. ఎస్ఐ సుధాకర్ సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. కాగా మృ తుడు రెడ్డిశేఖర్‌కు ఒక కుమార్తె హనీ ఇంటర్ చదువుతుండగా కుమారుడు కార్తీక్ బీటెక్ మొదటి సంవత్సరం చదువుతున్నాడు



ప్రమాదంలో దెబ్బతిన్న లారీ (ఇన్‌సెట్) రెడ్డిశేఖర్ (ఫైల్)

సోషల్ మీడియాలో అసత్య ప్రచారాలపై ఫిర్యాదు

● ఓ విలేఖరి, మరో ఇద్దరిపై కేసు నమోదు

సుండుపల్లె, జూలై6 (ఆంధ్రజ్యోతి): సోషల్ మీడియాలో అసత్య ప్రచారాలపై ఎస్ఐ శ్రీనివాసులుకు ఫిర్యాదు చేసినట్లు టీడీపీ మండల అధ్యక్షుడు కళ్లే రెడ్డెప్ప తెలిపారు. సోషల్ మీడియా వేదికగా గత కొద్ది రోజుల నుంచి టీడీపీ పార్లమెంట్ అధ్యక్షుడు జగన్‌మోహన్‌రాజుతో పాటు టీడీపీ ఆర్గనైజింగ్ సెక్రటరీ శివరాంనాయుడు, మైనార్టీ నాయకుడు మేకల మహబూబ్ బాషా, ఎస్సీసెల్ నాయకులు చంద్రమౌళి, బీజేపీ నాయకులు చమర్తి మహేశ్‌రాజు, మరికొందరిపైన వారి మనోభావాలు దెబ్బతినేలా అసత్య ప్రచారం చేస్తున్నట్లు తెలిపారు. ఈ మేరకు కంచన రెడ్డిశేఖర్, సాయితో ఓ విలేఖరిపై (ఆంధ్రజ్యోతి కాదు) ఫిర్యాదు చేశామన్నారు. అంతేగాకుండా తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తల మనోభావాలు దెబ్బతినేలా పార్టీ ప్రతిష్ఠకు భంగం కలిగేలా వ్యక్తిగత ద్వేషాలు పెరిగేలా ప్రచారం చేస్తున్నారని పేర్కొన్నారు. టీడీపీ నాయకుల ఫిర్యాదు మేరకు కంచనరెడ్డిశేఖర్, సాయి, ఓ విలేఖరి (ఆంధ్రజ్యోతి కాదు) ఈ ముగ్గురిపైన కేసు నమోదు చేస్తున్నట్లు ఎస్ఐ ముత్యాల శ్రీనివాసులు తెలిపారు. సోషల్ మీడియా వేధికగా అసత్య ప్రచారాలు చేస్తే చర్యలు తీసుకుంటామని ఎస్ఐ తెలిపారు.



పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేస్తున్న టీడీపీ మండల అధ్యక్షుడు, తదితరులు

పేద విద్యార్థికి ఆర్థిక సాయం

లక్కిరెడ్డిపల్లె, జూలై 6 (ఆంధ్రజ్యోతి): మానవత స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో అప్పకొండయ్యగారిపల్లె దళితవాడకు చెందిన జాన్ కోల్డ్ అఖిలకు ఆదివారం మానవత స్వచ్ఛంద సంస్థ దాత జెడ్పీ సీఈవో వెంకటసుబ్బయ్య రూ.10 వేలు ఆర్థిక సాయం అందజేశారు. ఈ సందర్భంగా ఆ సంస్థ మండల అధ్యక్షుడు డాక్టర్ షఫీనాయక్, చైర్మన్ బాలసుబ్రమణ్యం, కమిటీ డైరెక్టర్ ప్రసాద్‌యాదవ్, కన్వీనర్ శివయ్య, కోశాధికారి రవిశంకర్‌రెడ్డి, రాజారెడ్డి, శ్రీరాములు విద్యార్థికి అందజేశారు. ఈ సందర్భంగా పేద విద్యార్థి హార్టికల్చర్ డిప్లమో చదువుతోంది.



ఆర్థిక సాయం అందిస్తున్న మానవతా సభ్యులు

టీడీపీ కార్యకర్తకు పరామర్శ

నందలూరు, జూలై 6 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ఆడపూరు దళితవాడలో నివాసం ఉంటున్న టీడీపీ కార్యకర్త కుప్పాల వెంకటసుబ్బయ్యకు అనారోగ్యంగా బాధపడుతుం డటంలో ఆ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి మేడా విజయశేఖర్‌రెడ్డి ఆదివారం రూ.20 వేల ఆర్థిక సాయం అందజేశారు. ఈ సందర్భంగా విజయశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ వెం కటసుబ్బయ్య వెంటనే కోలుకోవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో నాగిరెడ్డిపల్లె, లేబాక, ఆడపూరు సర్పంచులు జంబు సూర్యనారాయణ, లంకాయగారి నరసయ్య, నందలూరు భాస్కర్‌రెడ్డి, టీడీపీ నేతలు రమేష్‌బాబు, బెస్త సుబ్రమణ్యం, పాల్గొన్నారు.



బాధితుడి కుటుంబాన్ని పరామర్శిస్తున్న విజయశేఖర్‌రెడ్డి

సార్వత్రిక సమ్మెను జయప్రదం చేద్దాం : ప్రజా సంఘాలు

రాజంపేట, జూలై 6 (ఆంధ్రజ్యోతి) : దేశవ్యాప్తంగా నిర్వహిస్తున్న సార్వత్రిక సమ్మెను జిల్లాలో జయప్రదం చేయాలని ఏఐటీయూసీ, సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు చంద్రశేఖర్, ఉపాధ్యక్షుడు చంద్ర, సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు చిట్వేలి రవికుమార్, ఏఐటీయూసీ కార్యదర్శి సికిందర్ పిలుపునిచ్చారు. ఆదివారం స్థానిక ఏఐటీయూసీ కార్యాలయంలో కార్మిక సంఘాల నేతలు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా ఈ సమ్మె చేపడుతున్నట్లు తెలిపారు. ఏఐటీయూసీ ఆటోవర్కర్స్ జిల్లా అధ్యక్షుడు నాగేశ్వరరావు, వ్యవసాయ సంఘం జిల్లా కార్యదర్శి పి.మణి, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ పీవీ రమణ, లక్ష్మీదేవి, ఎలక్ట్రికల్ యూనియన్ కార్యదర్శి శ్రీహరి, ఆటో డ్రైవర్ వర్కర్స్ ఫెడరేషన్ పెంచలయ్య, సాయికిరణ్, బాబుజాన్, అంగన్వాడీ యూనియన్ విజయమ్మ, రేవతి, ఏఐటీయూస ఆశావర్కర్స్ యూనియన్ వెంకటసుబ్బమ్మ, రెడ్డమ్మ, వీఆర్‌ఏ సంఘం శంకరయ్య, లక్ష్మీకర్‌రెడ్డి, సుబ్బరాయుడు తదితరులు పాల్గొన్నారు.



ఐక్యత చాటుతున్న కార్మిక సంఘాల నాయకులు

రేబిస్ వ్యాధి రాకుండా కుక్కలకు టీకాలు

రాజంపేట టౌన్, జూలై 6 (ఆంధ్రజ్యోతి) : రాజంపేట పట్టణ పరిసర ప్రాంతాల్లోని పెంపుడు కుక్కల నుంచి రేబిస్ వ్యాధి ప్రబలకుండా ఆదివారం టీకాలు వేశారు. ఆదివారం ప్రపంచ జూనోసిస్ దినోత్సవం సందర్భంగా ఉప సంచాలకుడు డాక్టర్ వై.విజయభాస్కర్‌రావు ఆధ్వర్యంలో పశువుల నుంచి మనుషులకు సంక్రమించే వ్యాధుల గురించి అవగాహన కల్పించారు. ఇందులో ప్రముఖంగా రేబిస్ వ్యాధి, దాని తీవ్రతపై పెంపుడు కుక్కల ప్రేమికులకు వివరించారు.

జప్తు చేసినా.. అమ్మేశారు!

- ఇసుక కేటాయింపుల్లో అధికారుల మాయాజాలం
- పోలీసు నిఘాతో ప్రయోజనం శూన్యం....
- చర్యలకు ప్రజా ప్రతినిధుల డిమాండ్

పెద్దతిప్పసముద్రం, జూలై 6 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం స్వాధీనం చేసుకున్న ఇసుకను ఎలాంటి అనుమతులు లేకుండానే తరలించినా ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంపై స్థానికుల్లో ఆగ్రహం వ్యక్తమవుతోంది. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో తంబళ్లపల్లె నియోజకవర్గంలోని పలు ప్రాంతాల్లోని ఇసుక పెద్ద ఎత్తున అక్రమంగా ఇతర ప్రాంతాలకు తరలిపోయింది. ఈ వ్యవహారంలో పాలకులు ప్రమేయం కూడా ఉండడంతోనే రెవెన్యూ అధికారులు గానీ, పోలీసులుగానీ పట్టించుకున్న పాపాన పోలేదని స్థానికులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. 2022ల్లో మల్లెల గ్రామ సమీపంలోని సంపతికోట ఏటిలో నియోజకవర్గ స్థాయి నేత ప్రోద్బలంతో, స్థానిక నాయకుడు రాత్రికి రాత్రే ఇసుకను బారీగా డంప్ చేశాడు. ఈ విషయంపై పలు పత్రికల్లో కథనాలు ప్రచురితం కావడంతో, అధికారులు ఇసుక డంప్‌ను సీజ్ చేశారు. ఈ మేరకు ప్రభుత్వం తరఫున ప్రకటన కూడా విడుదల చేశారు

అక్రమంగా తరలించారు

ఇసుక అక్రమ తవ్వకాలకు అనుకూలంగా ఉంటాడనే ఉద్దేశంతో అప్పటి పాలకుడు డిప్యూటీ తహసీల్దారుగా ఉన్న వ్యక్తిని తహసీల్దారుగా నియమించుకోవడంతో, వైసీపీ నాయకులు అడ్డూ అదుపూ లేకుండా ఇసుకను అక్రమంగా తరలించి సొమ్ము చేసుకున్నట్లు సమాచారం. 2024 ఎన్నికల కోడ్ అమలులోకి రాగానే టి. సదుం పంచాయతీ రామాపురం రీచ్ నుంచి సుమారు 10 వేల టిప్పర్ల ఇసుకను రాత్రికి రాత్రే కర్ణాటక రాష్ట్రానికి తరలించి సొమ్ము చేసుకున్నట్లు సమాచారం. చెన్నరాయునిపల్లె సమీపంలోని పాపాఘ్ని నదిలో ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఇసుక డంప్ నుంచి రెవెన్యూ అధికారుల అండదండలతో రాత్రికి రాత్రే ఇసుకను కర్ణాటక రాష్ట్రానికి తరలించారు. ఈ విషయం గుర్తించిన స్థానికులు అక్రమంగా ఇసుక తరలిస్తున్న లారీలను పట్టించినా అధికారులు చర్యలు తీసుకోకపోగా, లారీలను వదిలేసేవారు. దీంతో ఇసుక అక్రమ రవాణాకు అడ్డు అదుపు లేకుండా పోయింది.



మల్లెల పంచాయతీ అంకిరెడ్డిపల్లె ఏటిలో ఇసుక డంప్‌ను పరిశీలిస్తున్న స్పెషల్ పోలీసులు (ఫైల్)



జెట్టివారిపల్లె సమీపంలో అక్రమంగా డంప్ చేసిన ఇసుక (ఫైల్ ఫొటో)

జప్తు చేసిన ఇసుకనూ అమ్మేశారు.

పెద్దతిప్పసముద్రం మండలం మల్లెల గ్రామానికి సమీపంలోని అంకిరెడ్డిపల్లె, ఆవులరెడ్డిపల్లె సమీపంలో సంపతికోట ఏటి వాగులోని ఇసుక అక్రమ డంప్‌ను టీడీపీ నాయకులు, ప్రభుత్వం, ప్రజల దృష్టికి తీసుకెళ్లడంతో స్థానిక అధికారులు ఆ ఇసుక డంప్‌ను సీజ్ చేసి రెవెన్యూ అధికారుల స్వాధీనం చేశారు. ఈ విషయాన్ని స్థానిక నాయకులు లోకాయుక్త దృష్టికి తీసుకెళ్లడంతో ప్రత్యేక బృందంతో దర్యాప్తు చేయించింది. అయితే, స్థానిక తహసీల్దార్‌గా ఉన్న విద్యాసాగర్ ఓ సర్పంచుతో చేతులు కలిపి జప్తు చేసిన ఇసుకను పూర్తిగా అమ్మేశాడని, వారిపై చర్యలు తీసుకోవాలని కూటమి నేతలు డిమాండ్ చేస్తున్నారు.

ప్రభుత్వ ఆదేశం మేరకే అనుమతులు

అధికారుల ఆదేశాల మేరకు ప్రభుత్వ భవనాల నిర్మాణానికే ఇసుకను కేటాయించాం. అనుమతులు లేకుండా ఎవరికీ ఇసుక ఇవ్వలేదు. అక్రమంగా ఇసుక తరలించే వారిపై చర్యలు తీసుకున్నాం

- విద్యాసాగర్, డిప్యూటీ తహసీల్దార్

ఫిర్యాదు చేసినా ప్రయోజనం లేదు

గతంలో జప్తు చేసిన సుమారు 600 లోడ్లు ఇసుకను అమ్మేశారని రెవెన్యూ అధికారులకు, సబ్ కలెక్టర్‌కు ఫిర్యాదు చేసినా ప్రయోజనం లేదని బూర్లపల్లె గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. ప్రభుత్వ అవసరాలకు ఇసుకను ఇచ్చామంటూ స్థానిక వీఆర్వో, వీఆర్ఏ, రెవెన్యూ అధికారులు పొంతన లేని సమాధానాలు చెబుతున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. కనీసం ఇప్పటికైనా జప్తు చేసిన ఇసుకను ప్రభుత్వ పనులకు వినియోగించారా లేక రెవెన్యూ అధికారుల అండదండలతో అమ్మేశారా అనే కోణంలో విచారణ చేసి, చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

పీలేరుకు చేరుకున్న బాపట్ల ఇసుక

- తీరిన తాగునీటి ఫిల్ట్రేషన్ సమస్య



ఇసుకను తొట్టెల్లో నింపుతున్న కార్మికులు

పీలేరు, జూలై 6(ఆంధ్రజ్యోతి): పట్టణానికి సరఫరా చేసే తాగునీటి శుద్ధికి అవసర మైన ఇసుక కొరత సమస్య ఎట్టకేలకు తీరింది. ప్రకాశం జిల్లా బాపట్ల నుంచి నాణ్యమైన సముద్రపు ఇసుక ఆదివారం ఉదయం పీలేరు చేరుకుంది. ఆ ఇసుకను పీలేరు సింగిల్ విండో మాజీ అధ్యక్షుడు యల్లెల రెడ్డప్ప రెడ్డి, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ ఇరగన్న ఆధ్వర్యంలో ఆదివారం నీటి తొట్టెల్లో నింపారు. సమ్మర్ స్టోరేజ్ ట్యాంకుతోపాటు బాలంవారిపల్లె వద్దనున్న గార్గేయ ప్రాజెక్టు నుంచి పంపింగ్ చేసిన నీటిని సముద్రపు ఇసుక నిండిన తొట్టెల్లో నింపి ఫిల్టర్ చేసిన తరువాత ఓవర్‌హెడ్ ట్యాంకులకు సరఫరా చేయాల్సి ఉంది. ఇసుక కొరత కారణంగా కొంత కాలంగా నీటి పంపింగ్ ఆగిపోయింది. ఈ విషయంపై గత నెల 28న ఆంధ్రజ్యోతిలో 'తీరని దాహం!' శీర్షికతో కథనం ప్రచురితమవడంతో స్పందించిన ఎమ్మెల్యే నల్లారి కిశోర్ కుమార్ రెడ్డి, సింగిల్ విండో మాజీ అధ్యక్షుడు ఇసుకను బాపట్ల నుంచి తెప్పించారు. మరో నాలుగు రోజుల్లో పనులన్నింటినీ పూర్తి చేసి సమ్మర్ స్టోరేజ్ ట్యాంకు ద్వారా నీటిని పట్టణ వాసులకు అందజేస్తామని తెలిపారు.

ఆలయాభివృద్ధికి రూ.50 వేలు విరాళం



ఆలయాభివృద్ధికి విరాళం అందజేస్తున్న దాతలు

గుర్రంకొండ, జూలై 6 (ఆంధ్రజ్యోతి): రెడ్డెమ్మకొండ ఆలయ అభివృద్ధికి ఆదివారం గాలివీడుకు చెందిన టీచర్ వెంకట రమణా రెడ్డి రూ.25 వేలు, బి.కొత్తకోటకు చెందిన ఎర్రంరెడ్డి రూ. 25 వేలు విరాళం అందజేశారు. ఈ మొత్తాన్ని ఈవో మంజుల స్వీకరించారు. దాతలకు అమ్మవారి దర్శనం కల్పించి తీర్థప్రసాదాలను అందజేశారు. కార్యక్రమంలో ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

సంతానలక్ష్మికి ప్రత్యేక పూజలు

సంతానలక్ష్మిగా పేరుగాంచిన రెడ్డెమ్మ అమ్మవారికి అర్చకులు ఆదివారం ఉదయం అర్చన, పంచామృతాభిషేకం చేశారు. అనంతరం అమ్మవారిని పరిమళభరిత పుష్పాలతో అలంకరించారు. వివిధ ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో తరలివచ్చిన భక్తులు కొబ్బరి కాయలను సమర్పించి తీర్థప్రసాదాలను స్వీకరించారు.

అక్రమార్కులపై చర్యలు తీసుకోవాలి



అక్రమణకు గురైన స్థలం

రైల్వేకోడూరు రూరల్, జూలై 6(ఆంధ్రజ్యోతి): రెడ్డివారిపల్లి పంచాయతీ పరిధిలోని సర్వే నెంబర్ 557లో ఉన్న 0.30 సెంట్ల భూమి విషయంలో అక్రమాలకు పాల్పడిన వారిపై చర్యలు తీసుకోవాలని బాధితుడు మాధవయ్య డిమాండ్ చేశారు. ఈ భూమిని 2001లో కస్తూరి వెంకటయ్య నుంచి కొనుగోలు చేసి, పుల్లంపేట సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో తన తల్లి నారాయణమ్మ పేరు తో రిజిస్ట్రేషన్ చేయించినట్లు తెలిపారు. అప్పటి నుండి ఈ భూమి తమ స్వాధీనంలోనే ఉందని, అన్ని రకాల పన్నుల చెల్లిస్తూ భూమిని అనుభవిస్తున్నామని వివరించారు. కొంతకాలంగా కొందరు రెవెన్యూ శాఖ అధికారులతో కుమ్మకై సదరు సర్వే నెంబర్‌ను 557 నుంచి 557పి గా మార్చి 2025లో అక్రమంగా రిజిస్ట్రేషన్ చేయించుకున్నారని మాధవయ్య ఆరోపించారు. ఈ అక్రమ రిజిస్ట్రేషన్ ద్వారా తమకు తీరని నష్టం జరిగిందన్నారు. ఈ విషయమై సంబంధిత అధికారులకు పలుమార్లు ఫిర్యాదు చేసినా ఎలాంటి చర్యలు తీసుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లా అధికారులు స్పందించి తమకు న్యాయం చేయాలన్నారు.

సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలి

కడప నాగరాజుపేట, జూలై 6(ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వ కార్మిక ప్రజా వ్యతిరేక విధానాలను ఎండగట్టేందుకు ఈనెల 9న తలపెట్టిన సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని రైల్వే గూడ్స్‌షెడ్ హమాలీ యూనియన్ ఏఐటీయూసీ అధ్యక్ష, కార్యదర్శులు కేసీ బాదుల్లా, ఎస్.మహబూబ్ బాష పిలుపునిచ్చారు. ఆదివారం స్థానిక యూనియన్ కార్యాలయంలో వారు కరపత్రాలను విడుదల చేశారు అనంతరం మాట్లాడుతూ కార్మికులు పోరాడి సాధించిన 29 చట్టాలను నాలుగు లేబర్ కోడ్‌లుగా పెట్టుబడిదారులకు అనుకూలంగా మార్చారన్నారు. కార్మిక చట్టాల్లో మార్పులను ఉపసంహరించుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు పాల్, శ్రీను, చిన్నఓబులేసు, నాగేంద్ర, సూరి, సుబ్బరామ్, రంగనాయకులు, మల్లి పాల్గొన్నారు.

గొర్రెల మందపై దూసుకెళ్లిన ట్రాక్టర్

- 20 గొర్రెలు మృతి, 15 గొర్రెలకు తీవ్ర గాయాలు



ప్రమాద స్థలంలో మృతిచెందిన గొర్రెలు

వేంపల్లె, జూలై 6 (ఆంధ్రజ్యోతి): ఇసుక ట్రాక్టర్ దూసుకెళ్లడంతో 20 గొర్రెలు మృతిచెందగా మరో 15 గొర్రెలు తీవ్రంగా గాయపడ్డాయి. ఎస్ఐ తిరుపాల్‌నాయక్ కథనం మేరకు .... తాటిమాకులపల్లెకు చెందిన గంగులయ్యకు గొర్రెలు మేపుతుంటాడు. ఆదివారం మధ్యాహ్నం గొర్రెలకు నీరు తాగించేందుకు వెళుతూ నందిపల్లె వద్ద రోడ్డు దాటుతుండగా పులివెందుల వైపు నుంచి వేంపల్లెకు ఇసుక కోసం వెళుతున్న ట్రాక్టర్ మందపైకి దూసుకెళ్లింది. ట్రాక్టర్‌ను ఆపాలని కేకలు వేస్తున్నా దూసుకు రావడంతో గంగులయ్య పక్కకు దూకి ప్రాణాలు దక్కించుకున్నాడు. ఈ ప్రమాదంలో సుమారు రూ.4లక్షలు విలువైన 20 గొర్రెలు మృత్యువాతపడ్డాయని, 15 గొర్రెలు గాయపడ్డాయని బాధితుడు తెలిపాడు. ప్రమాదంపై కేసు నమోదు చేసి విచారిస్తున్నట్లు ఎస్ఐ తిరుపాల్‌నాయక్ తెలిపారు. ప్రమాద స్థలాన్ని కాంగ్రెస్ పార్టీ ముఖ్య అధికార ప్రతినిధి తులసిరెడ్డి, జడ్పీటీసీ సభ్యుడు రవికుమార్‌రెడ్డి, టీడీపీ మండల కన్వీనర్ మునిరెడ్డి తదితరులు పరిశీలించారు. బాధితుడిని పరామర్శించారు.

వ్యక్తి అదృశ్యం



అంజద్‌ఖాన్

కడప క్రైం, జూలై 6 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని జయనగర్ కాలనీకి చెందిన వనిపెంట అంజద్‌ఖాన్ (41) అదృశ్యమైనట్లు చిన్నచౌకు పోలీసులు తెలిపారు. కడప జయనగర్ కాలనీకి చెందిన వనిపెంట అంజద్‌ఖాన్ గతంలో ఇరిగేషన్ డిపార్ట్‌మెంటు కడప కార్యాలయంలో పనిచేసేవాడు. ఈ మధ్య బద్వేలుకు బదిలీపై వెళ్లాడు. కుటుంబ అవసరాలకోసం చేసిన అప్పులు తీర్చలేక బాధ పడుతుండేవాడు. ఈ నేపథ్యంలో జూన్ 28న ఆఫీసుకు వెళుతున్నానని ఇంట్లో చెప్పి వెళ్లి న ఆయన తిరిగి ఇంటికి వెళ్లలేదు. బంధువుల వద్ద విచారించినా ఆచూకీ తెలియకపోవడంతో అతని భార్య సల్మా ఈ నెల 5న చిన్నచౌకు పోలీసుస్టేషనులో ఫిర్యాదు చేశారు. ఎవరికైనా ఆచూకీ తెలిస్తే చిన్నచౌకు సీఐ నెం.9121100520, ఎస్ఐ 9121100521, 91211 00522లకు ఫోను చేసి సమాచారం తెలపాలని పోలీసులు తెలిపారు.

భార్య కాపురానికి రాలేదని భర్త ఆత్మహత్య



ఉరి వేసుకున్న గోపాల్

గాలివీడు, జూలై6(ఆంధ్రజ్యోతి): తన భార్య కాపురానికి రాలేదని ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్ఐ రామకృష్ణ తెలిపారు. అరవీడు పంచాయతీ మల్లసానివాళ్లపల్లెకు చెందిన తుపాకుల గోపాల్ (37)కు పెద్దమండెం మండలానికి చెందిన రమణమ్మతో పదేళ్ల క్రితం వివాహం కాగా, వీరికి నలుగురు పిల్లలున్నారు. గోపాల్ మద్యానికి బానిసై కుటుంబాన్ని పట్టించుకోకపోవడంతో అతని భార్య రమణమ్మ పుట్టింటికి వెళ్లిపోయింది. ఆమె కాపురానికి రాకపోవడంతో గత రాత్రి తాను చనిపోతున్నట్లు తల్లిదండ్రులకు చెప్పి తాను నివాసం ఉన్న ఇంట్లో చీరతో ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు

వివాహిత ఆత్మహత్య

చాపాడు, జూలై 6 (ఆంధ్రజ్యోతి): ఆర్థిక సమస్యలు తాళలేక ఓ మహిళ ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. మండలంలోని పల్లవోలు గ్రామానికి చెందిన గంగయ్య, రామాంజులమ్మ దంపతులకు (47) ఇద్దరు కూతుళ్లు. గంగయ్య కూలి పనులకు వెళ్లకుండా ఇంటివద్దే కాలక్షేపం చేసేవాడు. దీంతో మనస్తాపానికి గురైన రామాంజులమ్మ శనివారం సాయంత్రం ఇంటిలో చీరెతో ఫ్యానుకు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. మృతదేహానికి ప్రొద్దుటూరులోని జిల్లా ఆస్పత్రిలో ఆదివారం పోస్టుమార్టం చేయించి, కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ముగ్గురు జూదరుల అరెస్టు

- రూ.34550 స్వాధీనం

చెన్నూరు, జూలై 6(ఆంధ్రజ్యోతి): మండలంలోని బుడ్డాయపల్లె గ్రామ సమీప పొలాల్లో జూదమాడుతున్న అదే గ్రామానికి చెందిన ముగ్గురిని అరెస్టు చేసి వారి నుంచి రూ.34,550 నగదును స్వాధీనం చేసున్నట్లు సీఐ కృష్ణారెడ్డి తెలిపారు. పక్కాగా అందిన సమాచారం మేరకు ఆదివారం సాయంత్రం సిబ్బందితో కలిసి బుడ్డాయపల్లె గ్రామ సమీప పొలాల్లో దాడులు చేసి ముగ్గురిని అరెస్టు చేశామన్నారు.

హోరాహోరీగా అండర్-19 మెన్స్ క్రికెట్ పోటీలు

- ఇన్నింగ్ 59 పరుగుల తేడాతో అనంతపురం గెలుపు
- డ్రాగా ముగిసిన నెల్లూరు- చిత్తూరు మ్యాచ్



వరుణ్‌సాయి (అనంతపురం)



విష్ణువర్ధన్ (కర్నూలు)



మన్విత్‌రెడ్డి (నెల్లూరు)



హమీద్ (నెల్లూరు)

కడప స్పోర్ట్స్, జూలై 6 (ఆంధ్రజ్యోతి): ఏసీఏ అండర్-19 మెన్స్ మల్టీడే (మూడురోజుల) క్రికెట్ పోటీల్లో మూడవ రోజైన ఆదివారం కర్నూలు జట్టుపై అనంతపురం జట్టు ఇన్నింగ్స్ 59 పరుగుల తేడాతో గెలుపు సాధించింది. .

కేఓఆర్ఎం మైదానంలో

నగర శివారులోని కేఓఆర్ఎం క్రికెట్ మైదానంలో కర్నూలు-అనంతపురం జట్ల మధ్య మ్యాచ్‌లో తొలుత బ్యాటింగ్ చేసిన కర్నూలు జట్టు మొదటి ఇన్నింగ్స్‌లో 59.3 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 213 పరుగుల వద్ద డిక్లేర్ చేసిన సంగతి తెలిసిందే. తదుపరి బ్యాటింగ్‌కు దిగిన అనంతపురం జట్టు రెండవ రోజు 82.2 ఓవర్లలో 8 వికెట్లు కోల్పోయి 486 పరుగుల వద్ద డిక్లేర్ చేసింది. ఇందులో వీరారెడ్డి ఏకంగా 251 పరుగులు చేయగా, జయంత్‌కృష్ణ 79 పరుగులు, సందీప్‌రెడ్డి 55 పరుగులు చేసి జట్టు భారీ స్కోర్‌కు బాటలు వేశారు. దీంతో అనంతపురం జట్టుకు 273 పరుగులు ఆధిక్యత లభించింది. రెండవ ఇన్నింగ్స్ ప్రారంభించిన కర్నూలు జట్టు ఆట ముగిసే సమయానికి 26 ఓవర్లలో 3 వికెట్లు కోల్పోయి 115 పరుగులు చేసింది. ఇందులో విష్ణువర్ధన్‌నాయుడు 69 పరుగులు చేశాడు. ఆటకు చివరి రోజైన ఆదివారం ఓవర్‌నైట్ స్కోర్ 115 పరుగుల వద్ద బ్యాటింగ్‌కు దిగిన కర్నూలు జట్టు 51.1 ఓవర్లలో 214 పరుగులకు ఆలౌట్ అయింది. ఇందులో విష్ణువర్ధన్‌నాయుడు 87 పరుగులు చేశారు. అనంతపురం బౌలర్ వరుణ్‌సాయి నాయుడు 5 వికెట్లు పడగొట్టాడు. దీంతో ఇన్నింగ్స్ 59 పరుగుల తేడాతో అనంతపురం జట్టు గెలుపు సాధించింది.

వైఎస్ రాజారెడ్డి స్టేడియంలో..

వైఎస్ రాజారెడ్డి ఏసీఏ క్రికెట్ స్టేడియంలో నెల్లూరు జట్టు తన మొదటి ఇన్నింగ్స్‌లో 77.3 ఓవర్లలో 338 పరుగులకు ఆలౌట్ కాగా, చిత్తూరు జట్టు మొదటి ఇన్నింగ్స్‌లో 20 పరుగుల స్వల్ప తేడాతో వెనుకబడింది. అనంతరం రెండవ ఇన్నింగ్స్ ప్రారంభించిన నెల్లూరు జట్టు ఆదివారం నాటికి 87 ఓవర్లలో 384 పరుగులు చేసి ఆలౌటైంది. మన్విత్‌రెడ్డి 97 పరుగులు, ఎస్ఎస్ హమీద్ 67 పరుగులు, కారుణ్యప్రసాద్ 52 పరుగులు చేశారు. అనంతరం రెండవ ఇన్నింగ్స్ ప్రారంభించిన చిత్తూరు జట్టు ఆట ముగిసే సమయానికి 10 ఓవర్లపాటు బ్యాటింగ్‌చేసి 1 వికెట్ నష్టానికి 48 పరుగుల చేసింది. దీంతో నిర్వాహకులు మ్యాచ్‌ను డ్రాగా ప్రకటించారు.

బెల్టుషాపులపై అగ్రహారంవాసుల ఆగ్రహం



బెల్టుషాపులు ఎత్తివేయాలని కోరుతున్న మహిళలు, గ్రామస్థులు (ఇన్‌సెట్) పట్టుబడిన మద్యం సీసాలు

పోరుమామిళ్ల, జూలై 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అగ్రహారం గ్రామానికి మద్యం సరఫరా చేస్తున్నవారిని ఆదివారం గ్రామస్థులు వాటిని అడుకోవడంతోపాటు పోలీసులకు సమాచారం అందించారు. ఈ సందర్భంగా గ్రామస్థులు, మహిళలు మాట్లాడుతూ అగ్రహారంలో బడి, గుడి వద్ద మరో చోట పోటాపోటీగా బెల్టుషాపులు నిర్వహిస్తున్నారన్నారు. ఈ బెల్టుషాపులు లేనప్పుడు పోరుమామిళ్ల వెళ్లి తాగి వచ్చేవారని, ఇప్పుడు అగ్రహారంలోనే మూడు చోట్ల మద్యం లభిస్తుండడం, డోర్ డెలివరీ కూడా చేస్తుండడంతో మద్యం ప్రియుల ఆగడాలకు అంతు లేకుండా పోయిందన్నారు. పగలు రాత్రి తేడా లేకుండా మద్యంప్రియులు మద్యం తాగి గొడవ పడుతుండడంతో మహిళలకు మనశ్శాంతి లేకుండా పోయిందన్నారు. ఇప్పటికైనా అధికారులు చర్యలు తీసుకుని బెల్టుషాపుల నిర్వాహకులపై చర్యలు తీసుకుకోవాలని కోరుతున్నారు.

30 మద్యం సీసాలు స్వాధీనం

బెల్టుషాపులకు మద్యం తరలిస్తుండగా దాడులు చేసినట్లు ఎస్ఐ కొండారెడ్డి తెలిపారు. ఆదివారం తమకందిన సమాచారం మేరకు మండలంలోని అగ్రహారం ఊరి బయట మద్యం తీసుకెళుతున్న వ్యక్తిని అదుపులోకి తీసుకుని అతని నుంచి 30 సీసాలు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు తెలిపారు. గ్రామాల్లో ఎవరైనా బెల్టుషాపులు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

మహిళ హత్య కేసులో నిందితుడి అరెస్టు



విలేకరులతో మాట్లాడుతున్న డీఎస్పీ మురళినాయక్

పులివెందుల, జూలై 6 (ఆంధ్రజ్యోతి): మహిళను హత్య చేసిన కేసులో నిందితుడిని అరెస్టు చేసినట్లు డీఎస్పీ మురళినాయక్ తెలిపారు. ఆదివారం సాయంత్రం పులివెందుల అర్బన్ స్టేషన్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన వివరాలు వెల్లడించారు. పులివెందుల ని గుంత బజార్‌లో నివాసముంటున్న బోనాల హసీనా సౌదీకి వెళ్లి వచ్చింది. అక్కడ సంపాదించుకున్న డబ్బుతో వడ్డీ వ్యాపారం చేస్తూ జీవిస్తోంది. రెండేళ్ల క్రితం దేవిరెడ్డి కరుణ కుమారి అనే మహిళకు రూ.2 లక్షలను రూపాయి వడ్డీకి అప్పుగా ఇచ్చింది. ఆ మొత్తాన్ని చెల్లించాలంటూ ఈ మధ్యకాలంలో రుణగ్రహీతపై తీవ్రంగా ఒత్తిడి చేసింది. ఈ విషయం గమనించిన కరుణకుమారి కుమారుడు లిఖిత్ కుమార్ రెడ్డి జూన్ 29 మధ్యాహ్నం హసీనాను హత్య చేశాడు. ఆమె ఇంట్లోని ప్రామిసరీ నోట్లను తీసుకు వెళ్లి శిల్పారామం సమీపంలో కాల్చి వేశాడు. ఆదివారం ఉదయం ఉలిమెల్ల రింగ్‌రోడ్డులో పులివెందుల ట్రాఫిక్ సీఐ హాజీవల్లి,అర్బన్ ఎస్ఐ నారాయణ టీం నిందితుడిని అరెస్టు చేసినట్లు తెలిపారు.

12వ పీఆర్సీని వెంటనే నియమించాలి

కడప ఎడ్యుకేషన్, జూలై 6(ఆంధ్రజ్యోతి): పీఆర్సీని నియమించి కార్యాచరణను ప్రారంభించాలని ఏపీటీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఆదిరెడ్డి శ్యామ్‌సుందరెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం నగరంలోని ఏపీటీఎఫ్ జిల్లా కార్యాలయంలో ముఖ్య కార్యకర్తల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2023 జూలై 1 నుంచే 12వ పీఆర్సీ అమలు కావాల్సి ఉండగా రెండు సంవత్సరాలు గడిచినా కనీసం పీఆర్సీ కమిషన్‌ను కూడా నియమించక పోవడం వల్ల ఆర్థికంగా తీవ్రనష్టం జరుగుతోందన్నారు. పీఆర్సీ కమిషన్ చైర్మన్ రాజీనామా చేసి ఏడాదైనా ఇంత వరకు కొత్త కమిషన్‌ను నియమించలేదన్నారు. 12వ పీఆర్సీ అమలులో జాప్యం జరిగే అవకాశం ఉందని, వెంటనే ముఖ్యమంత్రి ఉద్యోగ, ఉపాధ్యాయ, పింఛనర్లకు 30 శాతం మధ్యంతర భృతిని ప్రకటించాలన్నారు. కూటమి ప్రభుత్వం ఎన్నికల సందర్భంగా ఇచ్చిన మధ్యంతర భృతిని, మెరుగైన ఫిట్‌మెంట్‌తో 12వ పీఆర్సీని ప్రకటించాలన్నారు. సమావేశంలో ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఖాదర్‌బాష, శ్రీనివాసరెడ్డి, జిల్లా కార్యదర్శులు రాంభూపాల్‌రెడ్డి, అబ్దుల్ సత్తార్, జిల్లాకౌన్సిలర్లు రామచంద్రారెడ్డి, కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కేసీ కెనాల్ షట్టర్లకు గేర్ బాక్సులు ఏర్పాటు చేయాలి

చెన్నూరు, జూలై 6(ఆంధ్రజ్యోతి): త్వరలో కేసీ కెనాల్‌కు నీరు రానున్న దృష్ట్యా ఉప కాల్వలకు ఉన్న తూములకు గేర్ బాక్సులు ఏర్పాటు చేయాలని మండల కన్వీనరు టీడీపీ కె.విజయ భాస్కర్‌రెడ్డి కోరారు. ఆదినిమ్మాయపల్లె ఆనకట్ట నుంచి కడప పాతకడప చెరువుకు వెళ్లే ప్రధాన కాల్వ, చెన్నూరు తూము ఉప కాల్వ షట్టర్ల గేర్‌బాక్స్‌లు చోరీ అయ్యాయని, తక్షణం వాటిని ఏర్పాటు చేయాలన్నారు. గేర్‌బాక్సులు లేకపోతే నీరు నిరంతరాయంగా ఉపకాల్వకు ప్రవహిస్తుందన్నారు. చెన్నూరు తూముకు ఉన్న మూడు షట్టర్లలో ఒకదానికి మాత్రమే గేర్‌బాక్స్ ఉందని, కేసీ అధికారులు ఆలస్యం చేయకుండా గేర్‌బాక్సులు ఏర్పాటు చేయాలన్నారు.

అందరూ కలిసి ఉంటేనే పార్టీకి మనుగడ



నియోజకవర్గ ఎన్నికల పరిశీలకులు గురుమూర్తితో టీడీపీ నేతలు

రామసముద్రం, జూలై 6(ఆంధ్రజ్యోతి): మండల టీడీపీ నేతలు కలిసికట్టుగా ఉంటేనే పార్టీకి మనుగడ ఉంటుందని, వ్యక్తిగత ప్రతిష్టకు పోయి వర్గాల్ని ప్రోత్సహిస్తే పార్టీకి భవిష్యత్తు దెబ్బతింటుందని మదనపల్లె నియోజకవర్గ టీడీపీ సంస్థాగత ఎన్నికల పరిశీలకులు గురుమూర్తిగౌడ్ అన్నారు. ఆదివారం మండలానికి విచ్చేసిన ఆయన మండలంలో జరుగుతున్న గ్రామ కమిటీ అధ్యక్ష ఎంపికను పరిశీలించారు. మండల పార్టీ నేతలు, కార్యకర్తలతో ఆయన మాట్లాడుతూ రామసముద్రం మండల టీడీపీకి కంచుకోటగా ఉండేదని, గత సార్వత్రిక ఎన్నికల్లో మండలంలో టీడీపీ హవా తగ్గిందని పార్టీ పునరుద్ధరణకు ఐక్యంగా పనిచేసి స్థానిక ఎన్నికల్లో అన్ని పంచాయతీల సర్పంచులు, ఎంపీటీసీలు, జడ్పీటీసీలు స్థానాలు కైవశం చేసుకునేలా అధ్యక్షుల ఎంపిక చేసుకోవాలని కోరారు. అనంతరం మండల పరిశీలకులు శ్రీనివాసులు నాయుడు ఆధ్వర్యంలో నిర్వహించిన రామసముద్రం, కురిజల, ఎలవానెల్లూరు, ఆర్.నడింపల్లె పంచాయతీల కమిటీ అధ్యక్షులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. రామసముద్రానికి బండ్ల జనార్ధన, ఆర్.నడింపల్లెకు వెంకటేష్, ఎలవానెల్లూరుకు గంగప్ప, ఎన్నికయ్యారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు విజయకుమార్‌గౌడ్, మాజీ అధ్యక్షుడు కొండూరు నారాయణరెడ్డి, ప్రశాంత్‌రెడ్డి, శ్రీనాథ్, చిన్నస్వామి, రాజేష్, పెద్దిరెడ్డి, బోయ రమణప్ప, లోకేష్, బద్రినాథ్, చెంగారెడ్డి, విశ్వనాథ్ పాల్గొన్నారు.

సంస్థాగత ఎన్నికలతో టీడీపీ బలోపేతం

మదనపల్లె టౌన్, జూలై 6(ఆంధ్రజ్యోతి): గ్రామ, వార్డు కమిటీల సంస్థాగత ఎన్నికలతో టీడీపీ మరింత బలోపేతం అవుతుందని పట్టణ సంస్థాగత ఎన్నికల పరిశీలకుడు మల్లికార్జునరెడ్డి పేర్కొన్నారు. ఆదివారం 14వ వార్డులో టీడీపీ ఇన్‌చార్జి నాగూర్ వలి ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో మల్లికార్జునరెడ్డి మాట్లాడుతూ ప్రతి కార్యకర్త, నేత టీడీపీని బలోపేతం చేసేందుకే పార్టీ అధిష్టానం సంస్థాగత ఎన్నికలు నిర్వహిస్తోందన్నారు. నేతలు సమన్వయమై కమిటీలను ఏకగ్రీవంగా ఎన్నుకునేలా చర్యలు తీసుకోవాలన్నారు. టీడీపీ నేతలు ఆర్కే రామకృష్ణాచారి, కుమార్, లోకేశ్, రాజేష్, శ్రీకాంత్, రవి, చలపతి, సుజాత, రత్నమ్మ, గౌతమి తదితరులు పాల్గొన్నారు.

నేడు టీడీపీ సంస్థాగత ఎన్నికలు

నిమ్మనపల్లి, జూలై 6(ఆంధ్రజ్యోతి): మండలంలో సోమవారం టీడీపీ సంస్థాగత ఎన్నికలు నిర్వహిస్తున్నట్లు మండల అబ్జర్వర్ శ్రీనివాసులు పేర్కొన్నారు. మొదట రాచవేటివారిపల్లి, రెడ్డివారిపల్లి, ముష్టూరు, కొండయ్యగారిపల్లి, వెంగంవారిపల్లి, అగ్రహారం, సామకోటవారిపల్లి, తవళం బండ్లపై గ్రామ పంచాయతీల్లో టీడీపీ నేతలు, కార్యకర్తల సమావేశాలు నిర్వహించి అభ్యర్థులను ఎన్నిక చేస్తామన్నారు.

పేదల సంక్షేమానికి పెద్దపీట

పీలేరు సింగల్ విండో అధ్యక్షుడు రెడ్డెప్ప రెడ్డి

పీలేరు రూరల్, జూలై 6: పేదల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం పెద్ద పీట వేస్తోందని పీలేరు సింగల్ విండో అధ్యక్షుడు వై. రెడ్డెప్ప రెడ్డి తెలిపారు. ఆదివారం సుపరిపాలన- తొలిఅడుగులో భాగంగా కట్టుకాల్వవీధి, రాజీవ్‌నగర్, శ్రీనాథపురం కాలనీల్లో ఇంటింటికీ తిరిగి ఏడాదిలో ప్రభుత్వం చేసిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు వివరిస్తూ కరపత్రాలు ఇంటింటా పంచారు. కార్యక్రమంలో తెలుగు యువత పీలేరు మండల అధ్యక్షుడు నల్లారి రియాజ్, మాజీ ఉప సర్పంచ్ మహ్మద్‌పీర్, ఏఎంసీ డైరెక్టర్లు లక్ష్మీకాంతమ్మ, వందన, అనురాధ, వివమ్మ, అబ్బవరం శివ, నాయకులు నాగేంద్రకుమార్, అబ్బవరం శీన, తదితరులు పాల్గొన్నారు.

అపూర్వం పూర్వ విద్యార్థుల కలయిక

చదివిన పాఠశాలే వేదిక



పాఠశాలలో కలిసిన పూర్వ విద్యార్థులు

వాల్మీకిపురం, జూలై 6(ఆంధ్రజ్యోతి): స్థానిక పీవీసీ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 1980లో టెన్త్ చదివి షష్ఠి పూర్తి వయసులో చదివిన పాఠశాల వేదికగా అపురూపంగా కలిశారు. నాటి జ్ఞాపకాలను నెమరు వేసుకుంటూ ఆనందాన్ని పంచుకున్నారు. దేశ విదేశాల్లో స్థిరపడిన వారు, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగాలు చేస్తున్నవారు, రాజకీయ, వ్యాపార రంగాల్లో ముత్యమై మెరిసిన నాటి విద్యార్థులంతా ఆదివారం పాఠశాల ప్రాంగణం చేరుకున్నారు. దాదాపుగా నాలుగున్నర దశాబ్దాలకు ముందు విడిపోయి ఎవరి జీవితాల్లో వారు స్థిరపడిన వారే. ఒక్కసారిగా అందరూ ఒకే వేదికను పంచుకోవడం ఒకరినొకరు చూసుకుంటూ ఆప్యాయంగా పలకరింపులు చదువుకున్న పాఠశాలలోని నాటి మధుర స్మృతులు, జ్ఞాపకాలను గుర్తు చేసుకుని మురిసిపోయారు. అందరి వయస్సు 60ఏళ్ల నిండడంతో షష్ఠి పూర్తిలో సైతం మధుర జ్ఞాపకాలను నెమరు వేసుకుని కేక్ కట్ చేసి ఒకరికొకరు తినిపించుకుని సందడి చేశారు. అనంతరం సహపంక్తి భోజనాలు చేస్తూ జీవిత ప్రయాణంలో పలు విషయాలను సరస్పరం పంచుకున్నారు.

ఏకలవ్యుని స్ఫూర్తితో పిల్లలను తీర్చిదిద్దండి

జయంతి సభలో గిరిజన సంఘం నేతలు



మెమెంటో అందజేస్తున్న గాలేటి ఆనంద్

మదనపల్లె, జూలై 6 (ఆంధ్రజ్యోతి): విలువిద్యలో ప్రావీణ్యం పొందిన ఏకలవ్యుడి స్ఫూర్తితో తమ పిల్లలను విద్యలో తీర్చిదిద్దాలని గిరిజన సంఘం నేత పి.వి.రమణ సూచించారు. ఆదివాసి మూల పురుషుడు ఏకలవ్యుడి జయంతిని గిరిజనసంఘ నేతలు ఆదివారం పట్టణంలో నిర్వహించారు. అంబేడ్కర్ సర్కిల్‌లో అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి ర్యాలీగా రామారావుకాలనీ చేరుకుని అక్కడ నిర్వహించిన సమావేశంలో సమాఖ్య వ్యవస్థాపక అధ్యక్షుడు కోనేటి దివాకర్ మాట్లాడుతూ హక్కుల సాధనకోసం పోరాడాలని పిలుపునిచ్చారు. సహకారశాఖ సహాయ రిజిస్ట్రార్ గాలేటి ఆనంద్ మాట్లాడుతూ ప్రతి ఒక్క గిరిజనుడూ రాజకీయ చైతన్యం కలిగి ఉండాలని సూచించారు. మహిళా డిగ్రీ కళాశాల అధ్యాపకురాలు మోహన్‌వల్లి మాట్లాడుతూ గిరిజన విద్యార్థులకు తనవంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. రిటైర్డ్ డీపీఓ శ్రీరాములు మాట్లాడుతూ క్రీడారంగంలో ప్రతిభావంతులకు ఏకలవ్యుని పేరుతో అవార్డులు ప్రకటించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఇరిగేషన్ డీఈ పూల గంగాధర్, బొజ్జప్ప, టీచర్ కిల్లా నాగరాజు మాట్లాడుతూ ఏకలవ్యుడు వనమూలికలతో వైద్యం తెలిసిన శాస్త్రవేత్త, వన్యప్రాణులను రక్షించే మహావీరుడని, అస్త్ర, శస్త్ర విద్యలు తండ్రి వద్దనే నేర్చుకున్నాడని కొనియాడారు. సంఘం నేతలు కృష్ణప్ప, శంకర్, కే.శివ, వేమనారాయణ, పూల వెంకటరమణ, ఆర్.వేమనారాయణ, మంగమ్మ, ఎం.విశ్వనాథ్, బండి రమణ, వసంత, ప్రకాష్, రామాంజులు, నందీప్, తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో తొలి ఏకాదశి పూజలు

పీలేరు, జూలై 6(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆలయాల్లో ఆదివారం తొలి ఏకాదశి పూజలను అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. రెడ్డిఅండ్‌రెడ్డి కాలనీలోని వినాయక స్వామి ఆలయంలో సత్యనారాయణ వ్రతం ఆచరించారు. ఆయా ఆలయాల్లో నిర్వాహకులు భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.

ఆర్‌ఓబీల నిర్మాణ జాప్యంపై నేడు ధర్నా

పీలేరు రూరల్, జూలై 6 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో నాలుగేళ్లుగా నత్తనడకన సాగుతున్న ఆర్‌ఓబీల నిర్మాణ జాప్యంపై పట్టణ పరిరక్షణ కమిటీ ఆధ్వర్యంలో నేడు తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు రవీంద్ర నాథరెడ్డి తెలిపారు. రైల్వే ఓవర్ బ్రిడ్జి నిర్మాణంలో జాప్యం చోటు చేసుకోవడంతో పట్టణ ప్రజలు, వ్యాపారులు, వాహన చోదకులు, ఉద్యోగులు, విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, పూర్తి స్థాయిలో వ్యాపారాలు దెబ్బతిన్నాయని చెప్పారు. మరోవైపు ప్రజలు శ్వాస కోశ వ్యాధుల బారిన పడి ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు.

ఝురి రోడ్డు... జర సూడండి



మట్టి కోసుకు పోయి, బయట పడిన కంకర ● వాహనదారులకు తప్పని ఇక్కట్లు

ఇక్కట్లలో పలు గ్రామాల ప్రజలు

కలకడ, జూలై 6 (ఆంధ్రజ్యోతి): ఫిబ్రవరిలో జరిగే ఝురి ఉత్సవానికి, కార్తీకమాసంలో నిర్వహించే లక్షదీపోత్సవానికి వచ్చే వేలాది మంది భక్తులకు ఇబ్బందులు కలగకుండా చూడాలని ఝురి వాసులు అధికారులను కోరుతున్నారు. కేవీపల్లె, సుండుపల్లె మండలాల్లోని పలు గ్రామాలకు ఈ రోడ్డు సౌకర్యంగా వుండడంతో ప్రజలు, ఉద్యోగులు రాకపోకలు సాగిస్తున్నారు. అయితే పదేళ్ల కిందట ఏర్పాటు చేసిన తారు రోడ్డుపై ఐదుకిలో మీటర్ల దూరం వెళ్లేందుకు అరగంట సమయం పడుతోందని, వర్షాలు కురిస్తే గుంతల్లో నీరు నిలిచి కంకర తేలిన రోడ్డుకు మరమ్మతు చేపట్టాలని ప్రజలు, ఉద్యోగులు కోరుతున్నారు. వివరాల్లోకెళితే....

మండలంలోని ఎర్రయ్యగారిపల్లె ఆర్చి నుంచి నలగుట్టపల్లి, అచ్చర్లవాండ్లపల్లె గ్రామాల మీదుగా ఝురీ వరకు వెళ్లే రోడ్డు గుంతల మయమైంది. ఐదు కిలో మీటర్లు దూరం ఉన్న ఈ రోడ్డుపై సుమారు పదేళ్ల కిందట తారు రోడ్డును నిర్మించినట్లు స్థానికులు తెలిపారు. తర్వాత పర్యవేక్షణ కొరవడడంతో రోడ్డుపై గుంతలు పడడమేకాక వర్షాలకు అందులో నీరు నిలవడంతో ఇరువైపులా మట్టి కోసుకుపోయి కంకర బయట పడింది. వాహనాల రాక పోకలకు దుమ్ములేచి విపరీతంగా అలుము కుంటుండడంతో ప్రమాదాలు జరిగే అవకాశం వుంది. ఈ ఏడాది ఫిబ్రవరిలో జరిగిన ఝురి ఉత్సవానికి హాజరైన వేలాది మంది భక్తులు ఇబ్బందిపడ్డారు. ఏటా కార్తీక మాసంలో ఝురిలో నిర్వహించే లక్షదీపోత్సవానికి తండోపతండాలుగా భక్తులు తరలివెళతారు. ప్రజల ఇబ్బందులను అధికారులు గుర్తించి రోడ్డు మరమ్మతులకు చర్యలు చేపట్టాలని, భవిష్యత్‌లో సమస్యలులేకుండా చూడాలని ప్రజలు కోరుతున్నారు.

అత్యవసర వేళల్లో అవస్థలు



కలకడ జాతీయ రహదారిపై వుండడంతో పీలేరు, రాయచోటి పట్టణాలకు త్వరగా చేరుకునేందుకు ప్రయాణానికి అనుకూలం. ముఖ్యంగా రాత్రిళ్లు, ఆరోగ్య సమస్యలు తలెత్తినపుడు అత్యవసర వేళల్లో ఈ రోడ్డుపై ప్రయాణం అవస్థలు తప్పడం లేదు.

గణేష్, తువ్వపల్లి, కేవీపల్లె మండలం

అడుగు పెట్టాలంటే భయమే



మా పల్లె నుంచి మండల కేంద్రం కలకడకు ఏదో పనిపై రాక తప్పదు. అయితే పాడై గుంతలు పడ్డ ఈ రోడ్డుపై అడుగు పెట్టాలంటే భయంగా వుంది. అధికారులు సమస్యను పరిష్కరించి ఇబ్బందులు తొలగించాలి.

కె. నటరాజు, తోటిపల్లి, కలకడ మండలం

ఇబ్బందులు తప్పడం లేదు



ఈరోడ్డు బాగా దెబ్బతినడంతో ప్రయాణంలో ఇబ్బందులు తప్పడం లేదు. మాఊరి నుంచి బతుకుదెరువు నిమిత్తం రోజూ కలకడకు రావాల్సివుంది. ఎదురుగా వాహనాలు వస్తే ప్రాణాలు గుప్పిట్లో పెట్టుకోవాలి. సమస్య కంటికి కనబడుతున్నా ఎవరూ పట్టించుకున్న దాఖలాలు లేవు. ప్రభుత్వం రోడ్డు సౌకర్యం ఏర్పాటు చేయాలి.

ఎన్. మనోహర్, చింతమాకులపల్లి



గుంతలు పడిన ఝురి రోడ్డు - కోసుకుపోయిన రోడ్డు

జలాధివాసానికి తరలిన పీర్లు

ప్రత్యేక పూజలు చేసిన ముజావర్లు ● హిందూ, ముస్లింల ఐక్యతకు ప్రతిరూపం

అగ్నిగుండంలో దిగిన భక్తులు ● చెరువులో శాస్త్రోక్తంగా శుభ్రపరిచిన యువత



వాల్మీకిపురంలో విశేషాలంకరణలతో పీర్లు

పీలేరు, జూలై 6(ఆంధ్రజ్యోతి): పవిత్ర మొహర్రం పండుగను హిందు, ముస్లింలు వేడుకగా చేసుకున్నారు. గ్రామ చావిడిలో పీర్లను ఏర్పాటు చేసి ముజావర్లతో ప్రత్యేక పూజల అనంతరం చివరి రోజు గ్రామాల్లో వేడుకగా ఊరేగింపు చేస్తూ భక్తులు అగ్నిగుండంలో ప్రవేశించారు. చివరికి పీర్లను శాస్త్రోక్తంగా జలాధివాసం చేసిన పీర్లను శుభ్రపరిచి తిరిగి భద్రపరుస్తారు. వివరాల్లోకెళితే...

మొహర్రం మాసం 10వ రోజు పీలేరు, మోడల్ కాలనీ, బోడుమల్లువారిపల్లె, రేగళ్లు, తలపుల గ్రామాల్లో పీర్ల పండుగను ఆదివారం అత్యంత భక్తిశ్రద్ధలతో చేసుకున్నారు. ఆయా ఊళ్లలోని పీర్ల చావిళ్లలో ప్రతిష్ఠించిన పీర్లను ముజావర్లు 10 రోజులుగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. బోడుమల్లువారిపల్లెలోని పీర్లు సంప్రదాయబద్ధంగా గ్రామోత్సవం చేస్తూ పీలేరు పెద్దపీర్ల చావిడిలోని పీర్లతో మమేకమయ్యాయి. బోడుమల్లువారిపల్లె పీర్ల ఊరేగింపు కోటిగారిపల్లె, యల్లమంద క్రాసు, క్రాసురోడ్డు, ఎల్‌బీఎస్ రోడ్డు, నెహ్రూబజారు, గాంధీ రోడ్డు, బ్రాహ్మణవీధుల్లో కలిశాయి. ప్రజలు కుల, మతాలకు అతీతంగా దారి పొడవునా చదివింపులు జరిపి మొక్కులు తీర్చుకున్నారు. ఊరేగింపు అనంతరం అయ్యపనాయుని చెరువులో శాస్త్రోక్తంగా శుభ్రపరిచారు. పెద్దపీర్ల చావిడి వద్ద యువకుల కేరింతలు, ఆటపాటలతో కోలాహల వాతావరణం నెలకొంది. బోడుమల్లువారిపల్లె పీర్లను సర్పంచ్ అమరనాథరెడ్డి కుటుంబీకులు ప్రత్యేక పూజలు జరిపి ఊరేగింపు ఆద్యంతం ముందు వరుసలో నిలబడి ఉత్సవాలు జరపగా పీలేరు అర్బన్ సీఐ యుగంధర్, ఎస్‌ఐ లోకేశ్ బందోబస్తు ఏర్పాటు చేశారు.

హిందూ ముస్లింల పూజలు

వాల్మీకిపురం, జూలై 6(ఆంధ్రజ్యోతి): వాల్మీకిపురం, చింతపర్తిలలో మొహర్రం వేడుకలను చేసుకున్నారు. చింతపర్తి పీర్ల చావడిలో పీర్లను నిలిపి హిందూ ముస్లింలు ఐక్యంగా పూజలు ప్రార్థనలు నిర్వహించారు. అనంతరం హిందూ ముస్లింలు సహపంక్తి భోజనాలు చేశారు. పట్టణంలో కూడా మొహర్రం వేడుకలు ఘనంగా జరిగాయి.

త్యాగానికి ప్రతీక...

కలకడ, జూలై 6(ఆంధ్రజ్యోతి): త్యాగానికి ప్రతీకైన మొహర్రం పండుగను ముస్లింలు భక్తి శ్రద్ధలతో చేసుకున్నారు. మండలంలోని ఎర్రకోటపల్లి సహా వివిధ గ్రామాల్లోని చావిడుల వద్ద నుంచి పీర్లను పూలతో ప్రత్యేకంగా అలకరించి పురవీధుల్లో ఊరేగించారు. కార్యక్రమంలో హిందువులు పాల్గొని మతసామరస్యాన్ని చాటుకున్నారు.

వేడుకగా పెద్ద పీర్ల పండగ

పెద్దమండ్యం, జూలై 6(ఆంధ్రజ్యోతి): మండలంలో పీర్ల పండుగను హిందూ, ముస్లింలు చేసుకున్నారు. పెద్దమండ్యం, గుడిసెవారిపల్లి, పి. తురకపల్లి గ్రామాల్లో పీర్ల చావిడి ఎదుట అగ్ని గుండం చుట్టూ డప్పుల దరువులు దిక్కులు పిక్కటిల్లాయి. తరవాత రాత్రి పీర్లను మెరవణి చేశారు. చివరి రోజు పీర్లను పురవీధుల్లో మెరవణి చేస్తూ అగ్నిగుండంలో దిగి భక్తులు భక్తి చాటుకున్నారు. గ్రామాల సమీప చెరువులు, బావుల్లో పీర్లను జలాధివాసం చేశారు. మొహర్రం పండగ 15 రోజుల పాటు పల్లెల్లో చేసుకుంటారని పలు గ్రామాల పెద్దలు తెలిపారు. పెద్దమండ్యంలో హుసేన్‌సాహెబ్, బాబాబేగ్, గౌస్‌బాష, అమీన్‌పీర్, ఖాదర్‌వలి, గుడిసేవారిపల్లి కుళాయిరెడ్డి, ఆలంసాబ్ అధిక సంఖ్యలో గ్రామ ప్రజలు పాల్గొన్నారు. పెద్దమండ్యం ఎస్‌ఐ వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో పోలీసు బందోబస్తు నిర్వహించారు.



పెద్దమండ్యంలో అగ్నిగుండంలోకి ప్రవేశిస్తున్న భక్తులు



ఎర్రకోటపల్లిలో పీర్లను ఊరేగిస్తున్న దృశ్యం

జలాధివాసానికి తరలిన పీర్లు

తంబళ్లపల్లె, జూలై 6(ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు గ్రామాల్లో కొలువు దీరిన పీర్లు జలాధివాసానికి తరలి వెళ్లాయి. మండల కేంద్రంలోని రాగిమాను వద్ద పీర్ల చావిడిలో ఏర్పాటు చేసిన పీర్లను పెద్ద ఎత్తున భక్తులు దర్శించుకుని ప్రార్థనలు చేశారు. పీర్లను పూలతో సుందరంగా అలంకరించి పట్టణంలోని పలు వీధుల్లో కోలాహలంగా ఊరేగించారు. పీర్లకు చక్కెర, బూంది చదివింపులు చేసి ప్రజలకు పంచిపెట్టారు. సాయంత్రం డప్పు వాయిద్యాల నడుమ యువత పీర్లను ఎత్తుకుని జలధికి తీసుకుని వెళ్లారు.

సామాజిక కార్యక్రమాలు ముమ్మరం చేస్తాం



అధ్యక్షుడు ఉమేష్‌కు నియామక పత్రం అందజేస్తున్న మైఫోర్స్ మహేష్

మదనపల్లె, జూలై 6(ఆంధ్రజ్యోతి): మైఫోర్స్ సంస్థ ఆధ్వర్యంలో సామాజిక సేవా కార్యక్రమాలు ముమ్మరం చేస్తామని వ్యవస్థాపక అధ్యక్షుడు, జనసేన రాష్ట్ర సంయుక్త కార్యదర్శి మైఫోర్స్ మహేష్ ప్రకటించారు. జనసేనపార్టీ కార్యాలయంలో ఆదివారం మైఫోర్స్ సంస్థ, దాని అనుబంధ సంఘాలకు నూతన కమిటీలను ప్రకటించారు. తల్లిదండ్రులు లేని ఆడపిల్లల విద్యకోసం మైఫోర్స్ విద్యా అభయం, పవనన్న ప్లాంటేషన్ డ్రైవ్, పవనన్న క్రికెట్ కప్, ఫుట్‌బాల్ టోర్నమెంట్ నిర్వహిస్తున్నట్లు తెలిపిన మహేష్ కార్యక్రమాలకు నూతన కమిటీలను ఎంపిక చేశారు. నూతన అధ్యక్షుడిగా ఉమేష్, ఉపాధ్యక్షులుగా ఫాజిల్‌ఖాన్, సి.నితిన్‌రాజ్, ఆర్గనైజింగ్ జనరల్ సెక్రటరీలుగా విద్యాసాగర్, సందీప్‌రెడ్డి, జనరల్ సెక్రటరీలుగా మధుసూదన్, మేకల వెంకటరాజు, ఆర్గనైజింగ్ సెక్రటరీలుగా కె.సురేష్, దండు రేవంత్ కుమార్, వర్కింగ్ సెక్రటరీగా మనోజ్‌కుమార్, అఫ్సర్‌బాషాను నియమించారు. స్పోర్ట్స్ అథారిటీ అధ్యక్షుడిగా బి.మహేంద్ర, ఐటీ విభాగంలో తోట సతీష్, ఎంప్లాయీస్ విభాగంలో వి.సురేష్, మహిళా విభాగంలో బసినికొండ శోభ, యూత్ విభాగంలో జి.నికేష్, సోషల్ మీడియా విభాగంలో బి.జయంత్, ప్రోగ్రామ్ కమిటీ అధ్యక్షునిగా కె.నాగేంద్రను నియమించారు.

ఫీజుల వేధింపుల నుంచి రక్షణ కల్పించండి

● ఫార్మసీ కళాశాల ఎదుట ఎస్‌ఎఫ్‌ఐ ధర్నా

మదనపల్లె టౌన్, జూలై 6(ఆంధ్రజ్యోతి): కళాశాలల ఫీజులు చెల్లించాలని విద్యార్థుల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్న ప్రైవేటు ఫార్మసీ కళాశాల యాజమాన్యం నుంచి విద్యార్థులకు రక్షణ కల్పించాలని ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి నరసింహ డిమాండ్ చేశారు. ఆదివారం సీటీఎం వద్ద వున్న ప్రైవేటు ఫార్మసీ కళాశాల ఎదుట ఎస్‌ఎఫ్‌ఐ నేతలు ధర్నా నిర్వహిచారు. కళాశాల యజమాన్యం ప్రభుత్వం నిర్ణయించిన ఫీజుల కన్నా అధికంగా వసూలు చేస్తున్నారని, ఫీజు రీయింబర్స్‌మెంట్ రాకపోవడంతో కళాశాల యజమాన్యం విద్యార్థులపై ఒత్తిడి తెస్తోందన్నారు. కోర్సు పూర్తి చేసిన విద్యార్థులకు సర్టిఫికెట్లు ఇవ్వాలంటే పెండింగ్ ఫీజులన్నింటినీ చెల్లించాలని చెబుతున్నారన్నారు ఓ విద్యార్థిని ఒత్తిడి భరించలేక సూసైడ్ నోట్ రాసి ఇంటి నుంచి వెళ్లిపోయిందన్నారు. చివరకు పోలీసులు కలగజేసుకుని విద్యార్థిని రక్షించారన్నారు. ప్రభుత్వం తక్షణమే ఈ కళాశాలపై విచారించి ప్రభుత్వం ఇచ్చిన నాక్, అటానమస్ గుర్తింపు రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ విషయమై ఢిల్లీ యూజీసీకి కూడా ఫిర్యాదు చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా సహాయ కార్యదర్శి అఫ్రీద్, జయబాబు, సమీర్, సుల్తాన్ పాల్గొన్నారు.

వైసీపీ విద్యార్థి రాష్ట్ర అధికార ప్రతినిధిగా చక్రధర్



పీలేరు రూరల్, జూలై 6 (ఆంధ్రజ్యోతి): వైసీపీ విద్యార్థి విభాగం రాష్ట్ర అధికార ప్రతినిధిగా పీలేరు వాసి సుంకర చక్రధర్ నియమితులయ్యారు. ఈమేరకు కేంద్ర పార్టీ కార్యాలయం నుంచి ఉత్తర్వులు వెలువడ్డాయి. అన్నమయ్య జిల్లా అధ్యక్షుడు ఆకేపాటి అమరనాథ్ రెడ్డి, రాష్ట్ర ప్రచార విభాగం వర్కింగ్ ప్రెసిడెంట్ హరిప్రసాద్ రెడ్డి, వైసీపీ విద్యార్థి విభాగం రాష్ట్ర అధ్యక్షుడు పానుగంటి చైతన్యకు ధన్యవాదాలు తెలిపారు.

యోగభోగేశ్వరుడికి ఏకాదశ రుద్రాభిషేకం



మదనపల్లె అర్బన్, జూలై 6(ఆంధ్రజ్యోతి): యోగభోగేశ్వరడికి ఆదివారం మహన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం నిర్వహించినట్లు అర్చకుడు విశ్వేశ్వర ప్రసాద్ తెలిపారు. పిప్పిలి గ్రామం మడిక్యల ఆలయంలో యోగభోగేశ్వరడికి ఆషాఢ శుద్ధ ఏకాదశి సందర్భంగా స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించి విశేషపూజలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.

బాలికలు ధైర్యంగా ఉండాలి

గుర్రంకొండ, జూలై 6(ఆంధ్రజ్యోతి): పాఠశాలలు, కళాశాలలో చదివే బాలికలు ధైర్యంగా ఉండాలని రిడో సంస్థ కార్యదర్శి ఈశ్వరయ్య అన్నారు. ఆదివారం బాలికల గురుకుల పాఠశాలలో అభయ ఫౌండేషన్ ఆధ్వర్యంలో అభయ-భవిత కార్యక్రమాల్లో ఆయన మాట్లాడుతూ బాలికలకు జాగ్రత్తలు, మెళకువలు తెలియజేశారు.

కుక్కలకు టీకాలు వేయించుకోవాలి

ములకలచెరువు, జూలై 6(ఆంధ్రజ్యోతి): ప్రపంచ జూనోసిస్ డే సందర్భంగా ఆదివారం ములకలచెరువు, బురకాయలకోట పశువైద్యశాలలో కుక్కలకు ఉచితంగా టీకాలు చేశారు. పశుసంవర్ధక శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ కల్యాణ్ వెంకటేష్ మాట్లాడుతూ కుక్కలకు రేబిస్ వ్యాధి టీకాలు ఉచితంగా వేయించుకోవాలన్నారు. పెంపుడు కుక్కలను పెంచుకునే ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా టీకాలు వేయించాలన్నారు. మండల పశువైద్యాధికారి నివేదిత, సిబ్బంది పాల్గొన్నారు.

వ్యాధుల పట్ల అవగాహన అవసరం

రామసముద్రం, జూలై 6(ఆంధ్రజ్యోతి): మండల పశువైద్య కార్యాలయంలో డాక్టర్ పావని ఆధ్వర్యంలో పెంపుడు కుక్కలకు ఉచిత రాబీస్ టీకాలు వేశారు. పశువుల నుంచి మనుషులకు సంక్రమించే వ్యాధుల్లో ర్యాబీస్ ఒకటని ఆమె వివరించారు. కార్యక్రమంలో డాక్టర్ పావని, పశువైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

80 కుక్కలకు టీకాలు

మదనపల్లె అర్బన్, జూలై 6(ఆంధ్రజ్యోతి): స్థానిక ఏరియా పశువైద్యశాలలో ఆదివారం ప్రపంచ జూనోసిస్ దినోత్సవం పురస్కరించుకుని 80 కుక్కలకు టీకాలు ఉచితంగా వేసినట్లు పశువర్ధకశాఖ డివిజన్ ఉప సంచారకులు డాక్టర్ నీరజ తెలిపారు. ఆమె మాట్లాడుతూ కుక్కల పెంపకంపై ఎందరో శ్రద్ధ చూపుతున్నారని, అందుకే ప్రస్తుతం అవి మానవ జీవితంతో ముడిపడి ఉన్నాయన్నారు. సరైన వ్యాక్సినేషన్ వేయించకుండా కుక్కలతో సన్నిహితంగా ఉండరాదన్నారు. కార్యక్రమంలో పశువైద్య డాక్టర్లు, పారా సిబ్బంది, ఏహెచ్‌ఎలు పాల్గొన్నారు. సహాయ సంచాలకులు డాక్టర్ రోహిణి, మండల పశువైద్యాధికారి డాక్టర్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలి

తంబళ్లపల్లె, జూలై 6(ఆంధ్రజ్యోతి): జంతు సంక్రమిత (జూనోసిస్)వ్యాధుల పట్ల ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని మండల పశు వైద్యాధికారి విక్రాంత్‌రెడ్డి సూచించారు. వ్యాధుల సంక్రమణ, నివారణ చర్యలు, జాగ్రత్తలపై పెంపుడు జంతువుల యాజమానులకు అవగాహన కల్పించారు. వ్యాధులు రాకుండా 34 పెంపుడు కుక్కలకు వ్యాక్సిన్లు వేసినట్లు పేర్కొన్నారు. పశు వైద్యులు ఇందు, సహాయకులు కిరణ్, ప్రవీణ్, సిబ్బంది రమణ పాల్గొన్నారు.

ఘనంగా ముఖర్జీ జయంతి

మదనపల్లె అర్బన్. జూలై 6(ఆంధ్రజ్యోతి): జనసంఘ వ్యవస్థాపకుడు శ్యామ్‌ప్రసాద్ ముఖర్జీ జయంతి వేడుకలు మదనపల్లె బీజేపీ నేతలు నిర్వహించారు. ముఖర్జీ చిత్ర పటానికి పార్టీ రూరల్ అధ్యక్షుడు వెంకటరమణారెడ్డి, జిల్లా ఎస్టీసెల్ అధ్యక్షుడు పిల్లస్వామి నాయక్, జిల్లా ఉపాధ్యక్షుడు నరేంద్రారెడ్డి, జిల్లా మహిళా ఉపాధ్యాయురాలు బాలజ్యోతి, యువనేతలు బండి ఆనంద్, గంధర్వరెడ్డి, గోపాల్‌రెడ్డి పాల్గొన్నారు.